PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 290 | విజయవాడ, ఆదివారం 26 మే 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 26 May 2024 | Rs

ఫ్రాన్స్‌లో స్తంభించిన విమాన సర్వీసులు

- పారిస్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల సమ్మె
- ఓర్లి విమానాశ్రయంలో 70 శాతం సర్వీసుల రద్దు

5



టైటిల్ కొట్టేదెవరో..?

6

- నేడు ఐపిఎల్ సీజన్-17 ఫైనల్
- రెండో టైటిల్‌పై సన్‌రైజర్స్.. మూడో టైటిల్‌పై కోల్‌కతా గురి

ఎట్టకేలకు పోలింగ్ డేటా బహిర్గతం

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓటింగ్ వివరాలు

తొలి 5 విడతల డేటా విడుదల చేసిన ఇసి

న్యూఢిల్లీ : సార్వత్రిక సమరానికి సంబంధించి ప్రత్యేకించి నియోజకవర్గాల వారీగా పోలింగ్ నమోదు గురించి అనేక సందేహాలతో కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం నాడు కీలక సమాచారాన్ని బహిర్గతం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఇప్పటివరకు జరిగిన ఐదు విడతల పోలింగ్‌లో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలైన నిర్దిష్ట ఓట్ల సంఖ్యను ఇసి ప్రకటించింది. ఐదు దశలకు సంబంధించి తుది పోలింగ్ శాతాలను గతంలోనే ఇసి విడుదల చేసింది. కానీ, ప్రతి నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల వాస్తవ సంఖ్యను నిర్దిష్టంగా వెల్లడించలేదు. అత్యంత ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నందున పోలింగ్ కేంద్రాల వారీగా ఓటు హక్కు వినియోగించుకున్న నిర్దిష్ట ఓటర్ల సంఖ్య, శాతాలను ఎన్నికల సంఘం ఎందుకు ప్రకటించడం లేదంటూ వివిధ స్వచ్ఛంద సంస్థలు సందేహాలను వ్యక్తం చేశాయి. దీనిపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వంటి సంస్థలు కోర్టును కూడా ఆశ్రయించాయి. అయితే పోలింగ్ కేంద్రాల వారీగా డేటా విడుదల చేయడం గందరగోళానికి దారితీస్తుందంటూ ఇసి వాదించింది. ఈ దశలో తాము కూడా డేటా విడుదల చేయాల్సిందిగా ఇసిని ఆదేశించలేమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం డేటా విడుదల చేయడం గమనార్హం.

తొలి విడతలో ఓటేసిన 11 కోట్ల మంది

ఏప్రిల్ 19న జరిగిన మొదటి విడత పోలింగ్‌లో 21 రాష్ట్రాల్లో 11కోట్ల (11,00,52,103) మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఇసి పేర్కొంది. ఏప్రిల్ 26న 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన రెండో విడతలో 10.58 కోట్ల (10,58,30,572) మంది ఓటు వేశారు. 11.32 కోట్ల (11,32,34,676) మంది పౌరులు మే 7న 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత జరిగిన పోలింగ్‌లో ఓటు వేశారు. నాల్గవ దశలో, 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 12.24 కోట్ల (12,24,69,319) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఇసి పేర్కొంది. ఇక ఐదవ విడతపోలింగ్‌లో భాగంగా 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 5.57 కోట్ల (5,57,10,618) మంది ఓటు వేశారు.



ప్రజాస్వామ్య ప్రయోజనాలను నెరవేర్చేందుకు దోహదం : ఇసి

పోలింగ్ కేంద్రాల వారీగా డేటా అప్‌లోడ్‌కు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తమకు మరింత స్థైర్యాన్ని ఇచ్చిందని లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓట్ల డేటా విడుదల సందర్భంగా ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది. చెక్కుచెదరని కృతనిశ్చయంతో ఎన్నికల ప్రజాస్వామ్య ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఇది, కమిషన్‌కు మరింత ఉన్నతమైన బాధ్యతను అప్పగించిందని ఇసి తెలిపింది. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు కొందరు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని ఆరోపించింది. పోలైన ఓట్ల డేటాను ఎవరూ మార్చలేరని స్పష్టం చేసింది. ఓటింగ్ రోజునే ఫారమ్ 17సి ద్వారా అందరి అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లకు ఈ సమాచారం అందచేస్తామని తెలిపింది. ఓటర్ టర్నవుట్ డేటా అభ్యర్థులకు ఎప్పుడూ అందుబాటులోనే వుంటుందని,అలాగే పౌరులకు ఓటర్ టర్నవుట్ యాప్ ద్వారా మిగతా 2లో

కౌంటింగ్‌కు అదనపు భద్రత

- 56 మంది పోలీసు అధికారులకు ప్రత్యేక డ్యూటీ
- అత్యధికంగా మాచర్లకు ఎనిమిది మంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలింగు అనంతరం రాష్ట్రంలో హింస చెలరేగిన నేపథ్యంలో కౌంటింగ్ నాడు, ఆ తరువాత శాంతి భద్రతల సమస్య రాకుండా చూసేందుకు పోలీస్ యంత్రాంగం దృష్టి సారించింది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఎస్‌పిలతో పాటు అదనంగా మరో ఎస్‌పి, అదనపు ఎస్‌పి ఇతర ఉన్నతాధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరంతా శనివారం సాయంత్రానికి విధుల్లో చేరాలని డిజిపి కార్యాలయం పేర్కొంది. సున్నిత ప్రాంతాల్లో శాంతి భద్రతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని డిజిపి కార్యాలయం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. విజిలెన్స్ ఎస్‌పి కరీముల్లా షరీఫ్‌ను అనంతపురంలోనూ, శ్రీకాకుళం ఎస్ఇబి అదనపు ఎస్‌పి గంగాధరంనుండి సత్యసాయి జిల్లాలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ ఎస్‌పి ఈశ్వరరావును చిత్తూరులోనూ, సిఐడి ఎస్‌పి కెజివి సరిత, ఎసిబి అదనపు ఎస్‌పి ఎం.మహేంద్రను తిరుపతిలో రిపోర్టు చేయాలని సూచించారు. ఎసిబి అదనపు ఎస్‌పి దేవప్రసాదునును నంధ్యాలలోనూ, సిఐడి అదనపు ఎస్‌పి ఉమామహేశ్వరరావును నెల్లూరులోనూ, సిఐడి అదనపు ఎస్‌పి వర్మ, విజిలెన్స్ ఎస్‌పి డి.హైమావతి, ఎస్ఇబి అదనపు ఎస్‌పి శ్రీలక్ష్మిని ప్రకాశం జిల్లాలోనూ నియమించారు. అదనపు ఎస్‌పి జయరామరాజును గుంటూరులో రిపోర్టు చేయాలని సూచించారు. ఎస్ఇబి అదనపు ఎస్‌పి పి.సోమశేఖరరావు, సిఐడి అదనపు ఎస్‌పిలు సిహెచ్.పాపారావు, వి.గోపాలకృష్ణ, రాజశేఖరరావు, మెరైన్ అదనపు మిగతా 2లో



రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్న మంటలు

గుజరాత్‌లో ఘోరం

- రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో భారీ అగ్ని ప్రమాదం
- 12 మంది చిన్నారులు సహా 27 మంది సజీవదహనం
- మృతుల సంఖ్య పెరగొచ్చు

రాజ్‌కోట్ : గుజరాత్‌లో ఘోరం చోటుచేసుకుంది. వేసవి సెలవుల్లో వినోదం కోసం క్రీడా ప్రాంగణానికి వెళ్లిన చిన్నారులు, వారి సంబంధికుల్లో 27 మంది అక్కడ సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. మరికొందరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రుల్లో అంతులేని వేధన అనుభవిస్తున్నారు. మాటలకందని ఈ విషాద ఘటన రాజ్‌కోట్ నగరంలో శనివారం సాయంత్రం ఒక గేమ్ జోన్‌లో సంభవించింది. మరణించినవారిలో 12 మంది చిన్నారులున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెలరేగుతున్న మంటలను అదుపు చేయడానికి శ్రమిస్తున్న వీడియోలు శనివారం సాయంత్రం మీడియాకు విడుదలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..టిఆర్‌పి గేమ్ జోన్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఒక నిర్మాణంలో ఈ మంటలు చెలరేగాయి. ప్రస్తుతం వేసవి శలవులు కావడంతో అక్కడ ఆడుకోవడానికి పెద్ద సంఖ్యలో పిల్లలు వచ్చారు. అదే సమయంలో ప్రమాదం జరగడంతో బాధితుల్లో అత్యధిక మంది చిన్నారులే ఉన్నారు. కడపటి వార్తలు అందేసరికి 20 మంది మృత దేహాలను వెలికితీసినట్లు రాజ్‌కోట్ పోలీసు కమిషనర్ రాజు భార్గవ తెలిపారు. ఈ విషాద ఘటనపై దర్యాప్తుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి భూపిందర్ పటేల్ ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల నష్టపరిహారాన్ని అందచేయనున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి రూ.50 వేలు అందచేయనున్నట్లు చెప్పారు. తక్షణమే అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని ఆయన ట్వీట్ చేశారు.

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

రాజ్‌కోట్ అగ్ని ప్రమాదం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులను తలచుకుంటే తన మనస్సు కలత చెందుతోందన్నారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలన్నారు. బాధితులకు అవసరమైన సాయాన్ని అందించేందుకు స్థానిక యంత్రాంగం కృషి చేస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ఓట్ల తారుమారుకు మోడీ యత్నాలు!

- ప్రజాస్వామ్యం పట్ల ఓటర్లలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కల్పించాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

ఈ ఎన్నికల్లో మోడీ ఎలాగైనా గెలవాలని ఎన్నికల కమిషన్‌ను గుప్పిట్లో పెట్టుకుని దాని ద్వారా ఏదోరకంగా తారుమారు (మానిప్యులేట్) చేసే ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ జరిగేలోపు చాలా ప్రమాదకరమైన ఘటనలు జరిగే పరిస్థితి కనిపిస్తోందన్నారు. కొన్ని సెలెక్టివ్ బూత్‌లు, నియోజకవర్గాల్లో మోడీ గెలుపు కోసం ఈ తారుమారు ప్రయత్నాలు చేసి మెజారిటీ సాధించడానికి కుట్ర చేస్తున్నారని, దీనికి ఎన్నికల కమిషన్ సహాయం చేస్తుండడం అభ్యంతరకరమైన విషయమని వ్యాఖ్యానించారు. ఎన్నికలు జరిగిన బూత్‌ల్లో ఎన్ని ఓట్లు పోలయ్యాయో వివరాలతో సహా ఇవ్వాలని సుప్రీంకోర్టులో కేసు వేస్తే తాము ఇవ్వలేమని, ఇస్తే ఏదో జరిగిపోతుందని ఎన్నికల కమిషన్ చెప్పడం చాలా అన్యాయమని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉద్యోగులు హక్కుల కోసం పోరాడితే నిర్బంధాలు ప్రయోగించే పోలీసులు... నేడు ఓటింగ్ యంత్రాలను ధ్వంసం చేస్తున్న వారిని కనీసం పట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, ఇది అసమర్థత కాదని ఉద్దేశపూర్వకమేనని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో చెక్‌పోస్టులు కూడా సక్రమంగా పనిచేయలేదని విమర్శించారు. మాచర్ల వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తప్పించుకున్నారంటే పోలీసుల సహకారం లేకుండా సాధ్యం కాదన్నారు. ఇప్పుడు సులభంగా బెయిల్ కూడా తెచ్చేసుకున్నారని తెలిపారు. ఓటర్ల ప్రాథమిక హక్కులు హరించేశారని, డబ్బు పంచిన అభ్యర్థులను, రాజకీయ వ్యక్తులను విచ్చలవిడిగా వదిలేశారని, ఒక్కరిపైనైనా కేసులు లేవని, అరెస్టులూ చేయలేదని విమర్శించారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికల్లో కోట్ల రూపాయల చలామణిని, డబ్బు పంచిపెట్టిన అభ్యర్థులను స్వేచ్ఛగా వదిలేశారని, ఇదేనా ఎన్నికల కమిషన్ సమర్థత అని ప్రశ్నించారు. తమలాంటి ప్రచారం చేసుకునే పార్టీలకు మాత్రం అనుమతులు ఇవ్వకుండా, జెండాలు కట్టనివ్వకుండా, చివరికి కళాకారులు డ్రెస్సులను కూడా మిగతా 2లో



ఢిల్లీలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఓటు వేసిన ప్రముఖులు

లోపలి పేజీలో..

అరటి, మొక్కజొన్న తోటలకు నష్టం

- రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షం, ఈదురుగాలులు

ఆరో విడతలో 61.46 శాతం పోలింగ్

- 543 లోక్‌సభ స్థానాలకు గాను 90 శాతం స్థానాల్లో ఎన్నికలు పూర్తి
- మిగిలిన 57 సీట్లకు 1న ఆఖరి విడత పోలింగ్
- 4న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఆరో విడత పోలింగ్ శనివారం చెదురుమదురు ఘటనలు మినహా మొత్తం మీద ప్రశాంతంగా జరిగింది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 58 లోక్‌సభ స్థానాలకు, అలాగే ఒరిస్సాలో అసెంబ్లీ స్థానాలకు శనివారం నిర్వహించిన పోలింగ్‌లో కడపటి సమాచారం ప్రకారం 61.46 శాతం ఓట్లు పోలయ్యాయి. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన వివరాల ప్రకారం, శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయానికి పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 79.78 శాతం ఓట్లు పోల్ కాగా, ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 54.03 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కాగా బీహార్‌లో 55.24 శాతం, హర్యానాలో 61.16 శాతం, జమ్ముకాశ్మీర్‌లో 54.46 శాతం, జార్ఖండ్‌లో 63.76 శాతం, ఢిల్లీలో 57.82 శాతం, ఒరిస్సాలో 70.23 శాతం ఓట్లు పోలయ్యాయి.

మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను 90 శాతం సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఇంకా మిగిలి వున్న 57 స్థానాలకు జూన్1న ఆఖరి విడత పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు జూన్4న చేపడతారు. మోడీ ప్రభుత్వం మూడవ సారి అధికారం చేజిక్కించుకోవడం అసాధ్యమని ఆరు దశల్లో తగ్గిన పోలింగ్ సరళిని బట్టి విశ్లేషకులు పేర్కొంటున్నారు. వరుసగా మూడు పర్యాయాలు ప్రధానిగా చేపట్టిన ఘనత స్వాతంత్ర్యానంతర భారత దేశ చరిత్రలో ఒక్కరికే దక్కింది. అదే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అంటే ప్రపంచ జనాభాలో పది శాతం దాకా ఉన్నారన్నమాట. పోలింగ్ శాతం ఈ ఆరు విడతల్లో సగటున 62 శాతం నుంచి 69 శాతం మధ్య పోలింగ్ జరిగింది. భగభగమంటున్న ఎండల మధ్య పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు ఓపికగా బారులు తీరారు.

సిఎస్‌పై తీవ్ర ఆరోపణలు

- అసైన్డ్ భూములు కాజేశారన్న జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్
- పరువునష్టం దావా వేస్తా : సిఎస్

ప్రజాశక్తి- సీతమ్మధార (విశాఖపట్నం)/ అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలో రూ.2000 కోట్ల విలువైన అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి కాజేశారని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయ్యాకే భూముల మార్పిడి జిఒ 596 తెచ్చారని, దాని ఆధారంగా తన కుమారుడిని విశాఖలో పెట్టి 800 ఎకరాలకుపైగా భూములను కాజేశారని అన్నారు. వాటి రిజిస్ట్రేషన్ల కోసం నాలుగు రోజుల క్రితం విశాఖ వచ్చి భోగాపురం ఎయిర్‌పోర్టుపై సమీక్ష అని చెప్పుకున్నారని చెప్పారు. విశాఖలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూర్తి యాదవ్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువైన 400 ఎకరాల ఎస్‌సి, బిసిల అసైన్డ్ భూములను సిఎస్ తన కుమారుడిని అడ్డంపెట్టి బినామీలపేరిట చేజిక్కించు కున్నారని ఆరోపించారు. వాటిని ఆఘమేఘాలపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ వందల ఎకరాల్లో ఉన్న అసైన్డ్ భూములపై జవహర్‌రెడ్డి కన్నేశారని, విమానాశ్రయం ఏడాదిలో పూర్తి కానున్నందున ఆ చుట్టు పక్కల భూములకు మంచి డిమాండ్ ఉంటుందన్న భావనతో వాటిని చేజిక్కించుకున్నారని మిగతా 2లో

విశాఖలో నాకెటువంటి భూములు లేవు : జవహర్‌రెడ్డి

తనపై నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు చేసిన విశాఖ కార్పొరేటర్ మూర్తి యాదవ్ మీడియా ముఖంగా క్షమాపణలు చెప్పాలని, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. లేనిపక్షంలో పరువునష్టం దావా వేయడంతోపాటు బాధ్యతాయుతమైన రాష్ట్ర ఉన్నతాధికారిపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను, తన కుటుంబ సభ్యులు, బంధువులు కాని విశాఖపట్టణం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అసైన్డ్ భూములు కొనలేదని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు సంబంధించి రాష్ట్ర అసెంబ్లీలో 2023 అక్టోబరులో చట్టం 35 ద్వారా చట్ట సభ ఆమోదం తెలిపిందన్నారు. చట్ట సవరణను అనుసరించి అసైన్డ్ భూములపై జీఓ నెంబరు 596ను రెవెన్యూ శాఖ జారీ చేసిందన్నారు. చట్ట సభ ఆమోదం మేరకు జీఓ జారీ అయితే దానిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆపాదించడం ఎంతవరకూ సబబని ఆయన ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో రూ.2 వేలకోట్ల విలువైన 800 ఎకరాలు అసైన్డ్ భూములు తాను కొట్టేసినట్లు మూర్తి యాదవ్ తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు సిఎస్ పేర్కొన్నారు. ఇటీవల వివాహమైన తన స్నేహితుడి కుమార్తె దంపతులను ఆశీర్వదించడానికి, భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనుల పరిశీలన కోసం ఆది, సోమవారాల్లో విశాఖలో పర్యటించానని తెలిపారు. తన కుమారుడు గత ఐదేళ్లలో విశాఖపట్టణం, ఉత్తరాంధ్రలో ఏ జిల్లాకు వెళ్లలేదని సిఎస్ స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనుల పరిశీలన పేరుతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండో విడత సిఎంగా ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లపై సమీక్షించానని చేసిన ఆరోపణ అవాస్తవమని పేర్కొన్నారు.

నరసరావుపేట టిడిపి అభ్యర్థిని అరెస్టు చేయండి

- డిజిపికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా ఈ నెల 13వ తేదీన నరసరావుపేటలో జరిగిన అల్లర్లు, హింసాత్మక ఘటనలపై చర్యలు తీసుకోవాలని, వైసిపి నాయకులపై దాడులకు పాల్పడటంతోపాటు, అల్లర్లకు కారణంగా నిలిచిన నరసరావుపేట టిడిపి అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబుపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు రావెళ్ల కిషోర్‌బాబు, నారాయణమూర్తి రాష్ట్ర డిజిపికి ఫిర్యాదు చేశారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తాను శనివారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. అరవింద్‌బాబు, ఆయన అనుచరులు కలిసి వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడటమే కాకుండా, ఆయన మామ కోటిరెడ్డిని గాయపరిచారని, మూడు కార్లను కూడా ధ్వంసం చేశారని చెప్పారు. హింసాత్మక ఘటనలకు సంబంధించి పల్నాడు జిల్లా ఎస్‌పి, కలెక్టర్‌కు వీడియో మేసేజ్‌లు పంపించినా వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వైసిపి నాయకులు డిజిపికి ఫిర్యాదు చేశారు.

అదనపు పని... ఆపై 'షోకాజ్'

- సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి
- నోటీసులు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- ఉద్యోగ సంఘం నాయకుల ఆగ్రహం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాబ్‌చార్ట్ ప్రకారం కాకుండా అదనపు పనిచేయించుకుంటున్న ప్రభుత్వం బయోమెట్రిక్ వేయడం లేదనే పేరుతో గ్రామ వార్డు సెక్రటేరియట్ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించింది. అటెండెన్స్ పేరుతో షోకాజు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించింది. శనివారం నోటీసులను మండలస్థాయిలో ఎంపిడిఓలు, పట్టణాల్లో కమిషనర్లు సిద్ధం చేశారు. సోమవారం నుండి వాటిని జారీచేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది ఉద్యోగులుండగా, వారిలో చాలామంది పని ఒత్తిడి కారణంగా ఏదో ఒక సందర్భంలో బయోమెట్రిక్ వేయని పరిస్థితులు ఉన్నాయి. బయోమెట్రిక్ వేయని ఉద్యోగులను గుర్తించి, వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించింది. శుక్రవారం నాడు విజయవాడ గ్రామ వార్డు సచివాలయం రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ శివప్రసాద్ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం మండలస్థాయి అధికారులు షోకాజ్ నోటీసులు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా అటెండెన్స్ వేయని ఉద్యోగుల వివరాలను సేకరించాలని ఎంపిడిఓలను డైరెక్టర్ ఆదేశించారు. శనివారం సాయంత్రానికి అధికారులు నివేదికను సిద్ధం చేశారు. దీని ఆధారంగా సోమవారం నోటీసులు ఇవ్వనున్నారు. అయితే గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై నియమించారు. వీటితోపాటు ఆరోగ్య సురక్ష, వై ఎపి నీడ్స్ జగన్, ఆడుదాం ఆంధ్ర కింద క్రీడాకారుల ఎన్‌రోల్, కులగణన సర్వే, ప్రభుత్వ సంక్షేమం (హెచ్‌సిఎమ్ లెటర్స్ ఇంటింటికీ పంపిణీ, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు, ఎన్నికల్లో బిఎల్ఓ డ్యూటీలు, ఇంటింటికీ ఓటర్ల స్లిప్పుల పంపిణీ, పోలింగ్‌కు కేంద్రాల సంసిద్ధత లాంటి పనులను ప్రభుత్వం చేయించింది. పని ఒత్తిడి అధికంగా ఉండటం, కార్యాలయం బయటకు వెళ్లాల్సి రావడంతో ఒక్కో రోజు బయోమెట్రిక్ సకాలంలో వేయలేకపోయారు. దీన్ని సాకుగా తీసుకుని నోటీసులిచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడాన్ని సచివాలయ ఉద్యోగులు తప్పుపడుతున్నారు.

ప్రతిరోజూ మూడుసార్లు బయోమెట్రిక్

సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ మూడుసార్లు బయోమెట్రిక్ హాజరువేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఎన్నికల సమయంలో ఇలా మూడుసార్లు బయోమెట్రిక్ వేయని ఉద్యోగులను గుర్తించి వారిపై చర్యలకు ఉపక్రమించింది. నోటీసు అనంతరం ఉద్యోగులు ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. శుక్రవారం సమీక్ష నిర్వహించిన సమయంలో ప్రతిరోజూ ఎన్ని నోటీసులు ఇచ్చారు. ఎన్నిటికి వివరణ వచ్చింది. సంతృప్తికరంగా ఉందా? లేదా? అనే అంశాలనూ చేర్చి సాయంత్రానికల్లా కలెక్టర్లకు నివేదిక పంపాలని డైరెక్టర్ సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఇన్‌టైమ్ అటెండెన్స్ కొన్ని మండలాల్లో 44 శాతం, మరికొన్ని మండలాల్లో 30 శాతం లోపు ఉందని అధికారులు గుర్తించి, మిగిలిన వారు విధుల్లో ఉన్నారా లేరా తేల్చాలని ఉన్నతాధికారులు వాయిస్ మెసేజ్ పంపించారు.

వేళాపాళా లేకుండా పనులు చేయించుకుంటూ, బయోమెట్రిక్ హాజరు ఒక్కదానినే పరిగణలోకి తీసుకుని తమకు షోకాజ్ నోటీసులిస్తుండటాన్ని ఉద్యోగులు తప్పుపడుతున్నారు. తమ జాబ్ చార్ట్‌తో పాటు ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో తాము భాగస్వామ్యమయ్యామని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు చెబుతున్నారు.

పార్లమెంట్ నియోజక వర్గాల వారీ పోలింగ్ వివరాలు

పిసి పేరు	మొత్తం ఓటర్లు	పోలింగ్ శాతం	పోలైన ఓట్లు
అమలాపురం (ఎస్‌సి)	1531410	83.85	1284018
అనకాపల్లి	1596916	82.03	1309977
అనంతపురం	1767591	80.51	1423108
అరకు (ఎస్‌టి)	1554633	73.68	1145426
బాపట్ల (ఎస్‌సి)	1506354	85.48	1287704
చిత్తూరు (ఎస్‌సి)	1640202	85.77	1406880
ఏలూరు	1637430	83.68	1370153
గుంటూరు	1791543	78.81	1411989
హిందూపూర్	1656775	84.70	1403259
కడప	1639066	79.57	1304256
కాకినాడ	1634122	80.30	1312255
కర్నూలు	1722857	76.80	1323071
మచిలీపట్నం	1539460	84.05	1293935
నంద్యాల	1721013	80.61	1387367
నర్సాపురం	1472923	82.59	1216550
నరసరావుపేట	1734858	85.65	1485909
నెల్లూరు	1712274	79.05	1353563
ఒంగోలు	1607832	87.06	1399707
రాజమండ్రి	1623149	80.93	1313630
రాజంపేట	1665702	79.09	1317448
శ్రీకాకుళం	1631174	74.43	1214128
తిరుపతి (ఎస్‌సి)	1729832	79.10	1368362
విజయవాడ	1704077	79.37	1352495
విశాఖపట్టణం	1927303	71.11	1370484
విజయనగరం	1585206	81.05	1284886

సిఎస్‌పై తీవ్ర ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. భోగాపురం విమానాశ్రయానికి దగ్గరలో ఉన్న విజయనగరం జిల్లా పరిధిలో పూసపాటిరేగ, డెంకాడ, నాతవలసలలో పెద్ద సంఖ్యలో భూములు రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని అత్యంత విలువైన ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో వందలాది ఎకరాలను జవహర్‌రెడ్డి బృందం చేజిక్కించుకుందని ఆరోపించారు. గండిగుండం, తర్లువాడ, గుడిలోవ, గిడిజాల, రామవరం, రావాడ, రావివలస, ముక్కాం, సవరవల్లి, తూడెం, బిటి కల్లాలు, భీమన్నదొరపాలెం, ఐనాడ, కనమాం తదితర గ్రామాల్లో జవహర్‌రెడ్డి ఒత్తిడితో వందల ఎకరాల అసైన్డ్ భూములు చేతులు మారి రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయన్నారు. మార్చి నుంచి జరిగిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, రూ.వేల కోట్ల విలువైన భూములను కొట్టేసిన వైసిపి నేతలు, ఐఎఎస్‌లపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతర హింసపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తరుణంలో జవహర్‌రెడ్డి అవేవీ పట్టనట్టు విశాఖ వచ్చి భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారాన్ని సమీక్షించి మరింత వేగంగా పనిపూర్తి అయ్యేలా తన అధికారంతో కిందిస్థాయి వారిపై ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో ఉత్తరాంధ్ర జనసేన ప్రాంతీయ సమన్వయకర్త నాగలక్ష్మి చౌదరి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- మృతుడు, ప్రధాన నిందితుడు వైసిపి వారే

ప్రజాశక్తి- మదనపల్లి (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో వైసిపి నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. హత్యకు గురైన వ్యక్తి, ప్రధాన నిందితుడు వైసిపికి చెందిన వారే. ఆధిపత్య పోరే ఈ ఘటనకు కారణం. హత్యకు గురైన వ్యక్తిపై రెండు హత్య కేసులు ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని గొల్లపల్లి దళితవాడకు చెందిన కొండుపల్లి ఆనంద్, ఆయన అనుచరులు చరణ్, మణికంఠ, చిన్నారెడ్డి మరికొంతమంది కలిసి శనివారం వేకువజామున అమ్మచెరువుమిట్ట అనపగుట్ట శివారు ప్రాంతంలో ఉంటున్న పుంగనూరు శేషాద్రి (35) ఇంటి తలుపులు పగలగొట్టి దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబడ్డారు. కత్తులు, వేట కొడవళ్లతో దాడి చేసి ఆయనను అతి కిరాతకంగా హత్య చేసి పరారయ్యారు. సంఘటనా స్థలాన్ని మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బహుజనసేన సంస్థను శేషాద్రి, ఆనంద్ కలిసి ఏర్పాటు చేశారని, వారిద్దరూ కలసి సెటిల్మెంట్లు చేసేవారని ఆయన చెప్పారు. రామారావు కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని శేషాద్రి ఏర్పాటు చేయడం, సొంతంగా సెటిల్మెంట్ చేస్తుండడంతో ఇరువురి మధ్య వివాదం ఏర్పడిందని తెలిపారు. గతంలో ఇద్దరి మధ్య



విచారణ చేస్తున్న డిఎస్‌పి (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన శేషాద్రి (ఫైల్)

జరిగిన గొడవల్లో రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని చెప్పారు. వీద్దరిరూ వైసిపికి చెందిన వారేనని తెలిపారు. తన దందాలకు అడ్డొస్తున్న శేషాద్రిని అంతమొందించాలని ఆనంద్ పథకం ప్రకారం తన అనుచరులతో కలిసి హత్య చేశాడని చెప్పారు. ప్రస్తుతానికి ఆరుగురిపై హత్య కేసు నమోదు చేశామని తెలిపారు. ఇంకా కొంతమంది ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు వన్ టౌన్ సిఐ వల్లి బాషా, టూ టౌన్ సిఐ యువరాజ్, రూరల్ సిఐ శేఖర్‌లతో మూడు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 2014, 2020 సంవత్సరాల్లో నమోదైన రెండు హత్య కేసుల్లో ఆనంద్ ప్రధాన ముద్దాయని, ప్రస్తుతం ఈ కేసులు కోర్టులో నడుస్తున్నాయని డిఎస్‌పి తెలిపారు.

విఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అల్లు అర్జున్ నంద్యాలకు వస్తున్నారన్న విషయాన్ని ముందుగా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకపోవడంపై జిల్లా ఎస్‌పి రఘువీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న స్పెషల్ బ్రాంచ్ పోలీస్ నాగరాజు, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న స్వామి నాయక్‌ను విధుల నుండి తప్పిస్తూ జిల్లా ఎస్‌పి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11న వైసిపి నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవికి సంఘీభావం తెలపడానికి అల్లు అర్జున్ నంద్యాలకు వచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియామవాళిని ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యే ఇంటి వరకు రోడ్డు షో నిర్వహించారు. రోడ్ షోకు పోలీసుల అనుమతి తీసుకోకపోవడం, అయినా పోలీసులు భద్రత కల్పించడం, అధిక సంఖ్యలో జనాలు గుమ్మిగూడటం పట్ల కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఎస్‌పి, డిఎస్‌పి, టూ టౌన్ సిఐపై ఛార్జ్‌షీట్ నమోదు చేయాలని అప్పట్లో ఆదేశించింది. అయితే, నిఘా విభాగం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ముందు రోజే అల్లు అర్జున్ నంద్యాలకు వస్తున్నట్లు ఉన్నతధికారుల దృష్టికి తీసుకురాకపోవడం వల్లనే సమస్యలు వచ్చాయని గ్రహించిన పోలీస్ బాస్ వారి ఇరువురిపై చర్యలపై తీసుకుంటూ విఆర్‌కు పంపారు.

అరటి, మొక్కజొన్న తోటలకు నష్టం

- రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షం, ఈదురుగాలులు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం వర్షాలు కురిశాయి. ఈదురుగాలుల ప్రభావంతో అరటి, మొక్కజొన్న తోటలు నేలవాలాయి. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉండగా, మధ్యాహ్నం నుంచి వాన మొదలైంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురవగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. ఈరురుగాలులతో కూడిన వర్షానికి అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కడవకల్లు, సూరేపల్లి, సంజీవపురం, ఓబులాపురం తదితర గ్రామాల్లో అరటి, మొక్కజొన్న తోటలు నేలకూలాయి. దాదాపు వంద ఎకరాలకుపైగా పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో ఈదురు గాలులకు నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపప్పూరు మండలం సింగనకుంటపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రైతు నారాయణస్వామికి చెందిన రెండు పాడి గేదెలు మృతి చెందాయి. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. జిల్లాలో 13.42 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. విజయవాడ నగరంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. పిఎన్ బస్‌స్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్, విఎంసి సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం ఫ్లైఓవర్ వద్ద నీరు నిలిచిపోయింది. హౌసింగ్ బోర్డు కాలనీ, కబేళా, విజయా డైరీ సెంటర్, చిట్టినగర్, మ్యాంగో మార్కెట్, సింగ్‌నగర్ వాంబే కాలనీ, కండ్రిక, ఆర్‌ఆర్‌పేట, బీసెంట్ రోడ్డు, పాలీక్లినిక్ రోడ్డు, బెంజి సర్కిల్ నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్, ఎపిఐఐసి కాలనీ, రామలింగేశ్వర్‌నగర్, భ్రమరాంభపురం తదితర ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా తయారైన డ్రైయినేజీ కారణంగా రహదారులపై నీరు పెద్ద ఎత్తున నిల్చిపోయింది. ఈ నీటిని మోటార్ ఇంజన్లతో బయటకు తరలించే ప్రక్రియను విఎంసి ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో భారీ వర్షం కురిసింది. విడవకుండా చిరుజల్లులతో ముసురు వాతావరణం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, ఆలమూరులో చెదురుమదురు జల్లులు పడ్డాయి. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో సముద్రపు అలలు ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట, గండేపల్లి, యు.కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు శనివారం వాతావరణం చల్లబడడంతో సేద తీరారు.

నేడు తీరం దాటనున్న తుపాను

బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడింది. ఉత్తరం వైపుగా కదులుతూ ఆదివారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారనుంది. అర్ధరాత్రికి బంగ్లాదేశ్, బెంగాల్ తీరాల సమీపంలో సాగర్‌ద్వీపం, ఖేపుపురా మధ్య తీరం దాటనుందని ఎపి విపత్తుల నిర్వణ సంస్థ డైరెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. సోమవారం వరకూ మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు. దక్షిణ కేరళ పరిసరాల్లో సముద్రమట్టానికి సగటును 5.8 కిలోమీటర్ల వరకూ ఆవర్తనం విస్తరించి ఉందని, మరో ఆవర్తనం ఈశాన్య మధ్యప్రదేశ్ సమీపంలో విస్తరించిందని తెలిపారు. రాజస్థాన్ నుండి మధ్యప్రదేశ్, విదర్భ మీదుగా తెలంగాణా వరకూ ద్రోణి కొనసాగుతుందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి ఒక మోస్తరు వర్షాలు పడతాయని తెలిపారు.

కౌంటింగ్‌కు అదనపు భద్రత

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌పి జిబిఆర్ మధుసూదనరావును పల్నాడు జిల్లాలో నియమించారు. మెరైన్ అదనపు ఎస్‌పి రజనీ, ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎ.వి.సుబ్బరాజును కృష్ణాజిల్లాకు కేటాయించారు. ట్రాన్స్‌కో ఎస్‌పి కె.లావణ్యలక్ష్మిని ఎన్‌టిఆర్ పోలీసు కమిషరేట్‌కు ఇచ్చారు. విజిలెన్స్ అదనపు ఎస్‌పి ఎన్.పూజిత, సిఐడి అదనపు ఎస్‌పి అజయ్‌ప్రసాదును ఏలూరు ఎస్‌పికి రిపోర్టు చేయాలని సూచించారు. విజిలెన్స్ అదనపు ఎస్‌పి మాసుమ్‌భాషాను పశ్చిమగోదావరికి, ఎస్ఐబి అదనపు ఎస్‌పి జి.వెంకటరాముడును కాకినాడకు కేటాయించారు. ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. వీరితోపాటు వేర్వేరు విభాగాలకు చెందిన డిఎస్‌పిలను ఆయా జిల్లాలకు కేటాంచారు. అత్యంత సున్నిత ప్రాంతాల బాధ్యతలను వీరు పర్యవేక్షించనున్నారు.

తులసి మరణం అంగన్‌వాడీ ఉద్యమానికి తీరనిలోటు

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు వై.తులసి అకాలమరణం అంగన్‌వాడీ ఉద్యోగులకు తీరనిలోటు అని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన తులసి సంస్మరణ సభ శనివారం జరిగింది. యూనియన్ విశాఖపట్నం జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా మొత్తం కార్మికవర్గ సమస్యలపై కూడా అంగన్‌వాడీ యూనియన్‌ను ముందుకు నడిపిన ఘనత తులసీదని కొనియాడారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం దిశగా ఉద్యమాలకు సిద్ధం కావడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. జనవరిలో 42 రోజులపాటు జరిగిన సమ్మె పోరాటంలో కార్మికవర్గం మద్దతును కూడగట్టడంలో, సిఐటియు నిర్ణయాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేయడంలో మంచి కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా, బెదిరింపులకు దిగినా బెదరకుండా ప్రజల మద్దతును పొందే విధంగా ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ఆమె హఠాన్మరణం యూనియన్‌కే కాకుండా విశాఖ కార్మిక వర్గానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ను ఏజెన్సీ ప్రాంతంలో ప్రారంభించామని, దానిని పట్టణ ప్రాంతానికి తీసుకురావడానికి ఎంతో కాలం పట్టిందని తెలిపారు. ఈ రోజున సంఘం రాష్ట్రమంతా వ్యాపించడానికి తులసి లాంటి కార్యకర్తలే కారణమన్నారు. ఆమె ఏ ఆశయం కోసం పోరాటం చేశారో దానిని అందరూ ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. తొలుత తులసి చిత్రపటానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, సుబ్బరావమ్మ, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబీరాణి, సుబ్బరావమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, బృందా, పద్మ, శోభ, వెంకటలక్ష్మి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, తులసి భర్త శ్రీనివాస్, కుమారుడు దిలీప్, కుమార్తె స్వాతి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, ఆశా, ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్, ప్రజానాట్యమండలి నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఓ స్క్రీనింగ్ పరీక్షకు 82.02శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ డిఇఓ) స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాఠశాల విద్యాశాఖలో 38 ఖాళీ పోస్టులకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) డిసెంబర్ 23వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష శనివారం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 28,451 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 21,991 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, 18,037 (82.02శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష జరిగింది.

ఓట్ల తారుమారుకు మోడీ యత్నాలు!

(మొదటి పేజీ తరువాయి)

పట్టుకుని కేసులు పెట్టారని వివరించారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ పారదర్శకతతో వ్యవహరించి అల్లర్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, తారుమారు కుట్రలను నిరోధించాలని, బూత్‌ల వారీ పోలింగ్ వివరాలను వెల్లడించి ఓటర్లకు ప్రజాస్వామ్యంపై విశ్వసనీయత కల్పించాలని కోరారు.

జూన్‌లోగా పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ

పోలవరం నిర్వాసితులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్యాకేజీలను జూన్ 4వ తేదీలోగా అమలు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పునరావాసం కోసం అనేక ఉద్యమాలు, పాదయాత్రలు నిర్వహిస్తున్న పోలవరం నిర్వాసితులపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న పాలకుల తీరును విమర్శించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాకపోవడంతో దేవీపట్నం మండలానికి చెందిన రైతు సీతారామయ్య ధవళేశ్వరం వద్ద ఆత్మహత్యకు పాల్పడి ప్రస్తుతం రాజమండ్రి ప్రభుత్వాస్పత్రిలో చావు బతుకుల్లో ఉన్నారని తెలిపారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాసితులకు ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను, పునరావాసాన్ని తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే మళ్లీ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ పాల్గొన్నారు.

రైతులందరికీ బోనస్ వర్తింపజేయాలి

- తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రజలు, రైతులు, ఇళ్లు లేని పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర ప్రతినిధి బృందం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు.

సిపిఎం డిమాండ్లు :

- రైతులకు బోనస్ చెల్లిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ సన్న బియ్యానికి మాత్రమే చెల్లిస్తామనటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అత్యధికమంది రైతులు దొడ్డ బియ్యం పండిస్తున్న విషయం ముఖ్యమంత్రికి తెలిసిందే. బోనస్ చెల్లింపు రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు.
- వర్షాకాలం రాబోతోంది. రైతులకు పెట్టుబడి సహాయం సకాలంలో అందించాలని కోరుతున్నాం. ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన మేరకు రైతుభరోసా జూన్ మొదటి వారంలోనే రైతుల అక్కౌంట్‌లలో పడేవిధంగా చర్యలు తీసుకోవాలి.
- బిఆర్‌ఎస్ పాలనలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, సాగుభూమి తదితర సమస్యల మీద ఆందోళనల సందర్భంగా పెట్టిన కేసులు ఉపసంహరించుకుంటామంటూ సిఎం వాగ్దానం చేశారు. ఎన్నికల సందడి అయిపోయిన నేపథ్యంలో వెంటనే ఆ కేసులను ఉపసంహరించాలని కోరారు.
- ఇళ్ల స్థలాలకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటూ ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న కాలంలోనే ఇండ్లు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. రెండున్నరేళ్లుగా వారు అక్కడే నివాసముంటున్నారు. వారికి పట్టాలిస్తామంటూ గతంలో సిపిఎం ప్రతినిధివర్గానికి సిఎం వాగ్దానం చేశారు. ఆ మేరకు పేదలు గుడిసెలు వేసుకున్నచోట, ప్రతి కుటుంబానికి 120 గజాల స్థలం కేటాయించి పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎట్టకేలకు పోలింగ్ డేటా బహిర్గతం

(మొదటి పేజీ తరువాయి)

నిరంతరం అందుబాటులో వుంటుందని తెలిపింది.

వివాదం ఎందుకు తెరపైకి వచ్చిందంటే..

సాధారణంగా నూటికి నూరు శాతం పోలింగ్ నమోదు కావడం గొప్ప విశేషం. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతానికి మించి ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాల్లోనే పేర్కొనడంతో సర్వత్రా విస్మయానికి గురి చేసింది. ఈ నేపథ్యంలోనే అసలు పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల నిర్దిష్ట సంఖ్యను ఎందుకు తెలియజేయడం లేదంటూ ఎన్నికల సంఘాన్ని పలు స్వచ్ఛంద సంస్థలు నిలదీస్తూ వస్తున్నాయి.

రోజునే ఫారమ్ 17సి ద్వారా అందరి అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లకు ఈ సమాచారం అందచేస్తామని తెలిపింది. ఓటర్ టర్నవుట్ డేటా అభ్యర్థులకు ఎప్పుడూ అందుబాటులోనే వుంటుందని,అలాగే పౌరులకు ఓటర్ టర్నవుట్ యాప్ ద్వారా నిరంతరం అందుబాటులో వుంటుందని తెలిపింది.

వివాదం ఎందుకు తెరపైకి వచ్చిందంటే..

సాధారణంగా నూటికి నూరు శాతం పోలింగ్ నమోదు కావడం గొప్ప విశేషం. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతానికి మించి ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాల్లోనే పేర్కొనడంతో సర్వత్రా విస్మయానికి గురి చేసింది. ఈ నేపథ్యంలోనే అసలు పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల నిర్దిష్ట సంఖ్యను ఎందుకు తెలియజేయడం లేదంటూ ఎన్నికల సంఘాన్ని పలు స్వచ్ఛంద సంస్థలు నిలదీస్తూ వస్తున్నాయి. ఇసి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఈ మేరకు ఇసిని ఆదేశించాలని కోరుతూ స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే సార్వత్రిక ఎన్నికలు కీలక దశలో ఉన్నందున పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల వివరాలను బహిరంగంగా విడుదల చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయలేమని సుప్రీంకోర్టు శుక్రవారం ఎడిఆర్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ వెంటనే శనివారం ఇసి ఈ డేటాను విడుదల చేయడం విశేషం.

ఫారమ్ 17సి ప్రాముఖ్యత

పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సమాచారానికి సంబంధించి ఫారమ్ 17సి చాలా కీలకమైనది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో నమోదైన ఓట్ల రికార్డును ఫారమ్ 17సిలోనే పొందుపరుస్తారు. ఈ డేటాను తక్షణమే విడుదల చేయాలనే ఎడిఆర్ సుప్రీంను కోరింది. మొదటి రెండు దశల పోలింగ్ ముగిసిన తర్వాత ఈ డేటాను ప్రచురించడంలో జాప్యం జరగడంతో ఈ పిటిషన్ దాఖలైంది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి దశ పోలింగ్ తర్వాత అన్ని పోలింగ్ కేంద్రాల ఫారమ్ 17సి స్కాన్ చేసిన స్పష్టమైన కాపీలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఓటర్ టర్నవుట్‌కు సంబంధించిన విశ్వసనీయమైన రికార్డులను ఇసి వెల్లడించాలని ఎడిఆర్ విన్నవించింది. అయితే, ఫారమ్17సిని ప్రచురించేందుకు ఎలాంటి చట్టబద్ధమైన ఆదేశాలు లేవని బుధవారం ఇసి కోర్టుకు తెలియచేసింది. ఆ పత్రాన్ని కేవలం అభ్యర్థులకు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే ఇవ్వగలమని తెలిపింది. కాగా ఓటర్ టర్నవుట్ డేటా విడుదల చేసే ప్రక్రియపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన తీర్పుపై తాము మరింత బలోపేతమైనట్లు ఎన్నికల కమిషన్ శనివారం అభిప్రాయపడింది.

టిడిపి నేత కారుకు నిప్పు

- ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశకి- యంత్రాంగం

ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలంలో టిడిపి నేత కారును గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి తగలబెట్టారు. మూలగుంటపాడుకు చెందిన టిడిపి నేత, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు చిగురుపాటి శేషగిరిరావు తన ఇంటి ముందు పార్క్ చేసిన కారును అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పు అంటించారు. శేషగిరిరావు ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సిసి కెమెరాల్లో పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు.

కారు తగులబెట్టిన కేసు చేధించిన పోలీసులు

ఈ కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే చేధించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఓ బైకును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను అదనపు ఎస్‌పి(క్రైం) ఎస్‌వి.శ్రీధరరావు శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుపాటి శేషగిరిరావు తన ఇంటి వద్ద పార్కు చేసిన కారుపై పాలేటి అభిషేక్, మరో బాలుడు పెట్రోల్ పోసి నిప్పంటించారు. చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో వారు అక్కడ నుంచి పారిపోయారు. ఓ స్థల వివాదంలో ఈశ్వర్ లాడ్జీ నిర్వాహకుడు కానసాని ఈశ్వర్‌రెడ్డి, అశోక్‌కి మధ్య శేషగిరిరావు మధ్యవర్తిగా ఉన్నారు. వారి మధ్య కుదిరిన ఒప్పంద పత్రాన్ని శేషగిరిరావు వద్ద ఉంచారు. సంబంధిత ఒప్పంద పత్రాలు ఇవ్వాలని ఈశ్వర్‌రెడ్డి అడుగగా, అందుకు శేషగిరిరావు నిరాకరించారు. దీంతో వారి మధ్య మనస్పర్ధలు తలెత్తాయి.

దీన్ని మనసులో పెట్టుకొని ఈశ్వర్ రెడ్డి తన దగ్గర పనిచేసే ఓ బాలుడు, అతని స్నేహితుడు అభిషేక్ సాయంతో శేషగిరిరావు కారును తగలబెట్టేందుకు పథకం పన్నారు. శుక్రవారం రాత్రి ఈశ్వర్‌రెడ్డి మూడు పెట్రోల్ బాటిళ్లను తెచ్చి అభిషేక్, బాలుడికి ఇచ్చారు. వారు అర్ధరాత్రి సమయంలో బైకుపై శేషగిరిరావు ఇంటికి వెళ్లారు. ఇంటి ముందు పార్కు చేసిన కారుపై పెట్రోల్ పోసి తగులబెట్టి పరారయ్యారు. దర్యాప్తు అనంతరం ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్‌పి తెలిపారు. ఈ ఘటన కేవలం వ్యక్తిగత ద్వేషంతో జరిగిందని, శేషగిరిరావును భయభ్రాంతులకు గురిచేసి ఒప్పంద పత్రాన్ని తీసుకోడానికి ఈ చర్యకు పాల్పడినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణమూ లేదని పేర్కొన్నారు.

అసమానతల తొలగింపునకు

సంపన్నులపై పన్ను

పరిశోధనా పత్రంలో థామస్ పికెటి సూచన



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

సంపన్నులపై అతి తక్కువ స్థాయిలో పన్ను వేస్తే భారత్‌లోని ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చునని థామస్ పికెట్టి తదితర ఆర్థిక వేత్తల నేతృత్వంలోని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ పేర్కొంది. రూ.10 కోట్ల కంటే ఎక్కువ నికర సంపద కలిగిన వ్యక్తులపై వార్షిక పన్ను (ప్రోగ్రెసివ్ వెల్త్ టాక్స్, కాంప్రహెన్సివ్ టాక్స్) 2శాతం విధించాలని, రూ.10 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్‌లపై 33 శాతం వారసత్వ పన్ను (ఇన్‌హెరిటెన్స్ టాక్స్) వేయాలని సూచించింది. ఈ పన్నులు పెంచితే స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 2.7 శాతం రాబడి పెరుగుతుందని వివరించింది. ప్రధాని మోడీ పదేళ్ల పాలనాకాలంలో దేశంలో పేదలు, సంపన్నుల మధ్య భారీగా పెరిగిన అంతరాలను వివరిస్తూ.. ల్యాబ్ ఈ సూచన చేసింది. "ఇన్‌కం అండ్ వెల్త్ ఇన్‌ఈక్వాలిటీ ఇన్ ఇండియా 1922–2023" పేరుతో ల్యాబ్ విడుదల చేసిన నివేదికలోని వివరాలు...

దేశంలోని ఒక్క శాతం సంపన్నులపై అదనంగా వేసే పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని నేరుగా పేదల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయవచ్చునని, సామాజిక వ్యయాన్ని పెంచడానికి ఉపయోగించవచ్చని రచయితలు, ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భర్తి, లూకస్ చాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి సూచించారు. అత్యంత సంపన్నుల కోసం సమగ్రమైన, ప్రగతిశీల సంపద పన్ను ప్యాకేజీని ప్రవేశపెట్టడం ద్వారా భారత్‌లో పెరుగుతున్న ఆదాయం, సంపద అసమానతలను పరిష్కరించవచ్చున్నారు.

రూ.100 కోట్ల ఆదాయంపై 4% పన్ను

ఆర్థిక సంవత్సరం 2022–23లో భారత జనాభాలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మంది దేశ ఆదాయంలో 22.6 శాతం, సంపదలో 40.1 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నారు. మనదేశంలో అసమానతలు అమెరికా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ కంటే అధికంగా ఉన్నాయని నివేదిక వివరించింది. 2014–15 నుంచి 2022–23 మధ్య మన దేశంలో భారీగా అసమానతలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదికలో నిపుణులు 'కోటీశ్వరుల పన్ను'ను ప్రతిపాదించారు. 2022–23లో రూ.10 కోట్లు దాటిన వారు మాత్రమే చెల్లించేలా చూడాలన్నారు. ఈస్థాయి వారు దేశంలో కేవలం 0.04 శాతం పెద్దలు మాత్రమే ఉన్నారని అంచనా వేశారు. పన్ను ప్యాకేజీలో బేస్‌లైన్, మోడరేట్, అంబీషస్ పేర్లతో మూడు రకాల పన్నులను ప్రతిపాదించారు. బేస్‌లైన్ వేరియంట్‌లో రూ.10 కోట్ల కంటే ఎక్కువ నికర విలువ కలిగిన వ్యక్తులపై వార్షిక పన్ను 2శాతం విధించాలి. రూ.10 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్‌లపై 33 శాతం వారసత్వ పన్ను (ఇన్‌హెరిటెన్స్ టాక్స్) వేయాలి. ఇది ఒక్కటే జిడిపిలో 2.7 శాతం రాబడిని పెంచుతుంది.

మోడరేట్ వేరియంట్ కింద రూ.10 కోట్ల నుండి రూ.100 కోట్ల మధ్య నికర విలువ కలిగిన వ్యక్తులపై పన్నును 4 శాతానికి పెంచాలి. ఈ విలువ కలిగిన ఎస్టేట్‌లపై 33 శాతం వారసత్వ పన్ను వేయాలి. రూ.100 కోట్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఎస్టేట్‌లకు, వారసత్వ పన్నును 45 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ పన్ను విధానం భారత జిడిపిలో 4.6 శాతానికి సమానమైన ఆదాయాన్ని ఆర్జించగలదు. అంబీషస్ పన్ను విధానంలో వ్యక్తులపై పన్ను రేట్లను 3 శాతం నుండి 5 శాతం మధ్య, ఎస్టేట్‌లపై వారసత్వాలకు 45 శాతం నుండి 55 శాతం మధ్య పన్ను పెంచాలని ప్రతిపాదించింది. దీంతో స్థూల జిడిపిలో పన్ను రాబడులు 6.1 శాతానికి పెరగవచ్చని అంచనా వేసింది.

విద్య, వైద్యం కోసం ఖర్చు..

గత 15 ఏళ్లుగా విద్యపై వ్యయం 2.9 శాతంగానే ఉంది. తాము సూచించిన పన్నులు వేస్తూ.. విద్యారంగానికి నిధులను రెట్టింపు చేస్తూ... నూతన విద్యావిధానంలో పేర్కొన్నట్టు ఆరు శాతం నిధులను కేటాయించవచ్చునని ఆ నివేదిక వివరించింది. "సంపన్నులపై వేసే పన్నులతో వచ్చే ఆదాయాన్ని పేదలకు ప్రత్యక్ష నగదు బదిలీలు, విద్య, వైద్యం, ఇతర సామాజిక రంగాలలో ఖర్చు చేయాలి. తద్వారా పునః పంపిణీ విధానాలలో పెట్టుబడి పెట్టవచ్చు. తమ ప్రతిపాదిత సంపద పన్ను ప్యాకేజీలు సామాజిక రంగ వ్యయాన్ని విస్తరించడానికి, వ్యాపార అవకాశాలను సృష్టించడానికి దోహదం చేస్తాయి. బేస్‌లైన్ వేరియంట్ సంపద, వారసత్వ పన్నుల ద్వారానే ప్రస్తుత ప్రభుత్వ విద్యా వ్యయాన్ని దాదాపు రెట్టింపు చేయడానికి వీలుంది. అదే విధంగా మోడరేట్ వేరియంట్ టాక్స్ ద్వారా ఉమ్మడి ఆరోగ్యం, విద్యా బడ్జెట్‌ను దాదాపు రెట్టింపు చేయవచ్చు." అని రిపోర్ట్ పేర్కొంది. అంబీషస్ వేరియంట్ పన్నుల ద్వారా ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ సంయుక్త బడ్జెట్‌ను రెట్టింపు చేయడానికి వీలుంది. పైగా అదనంగా మిగులు కూడా ఉంటుంది. ఈ పన్నుల విధానం దేశంలోని కేవలం 0.04 శాతం మంది పైనే ప్రభావం చూపుతుంది.

అగ్ర కులాలదే ఆధిపత్యం

భారత్‌లోని ఆర్థిక అసమానతలు కులాలతోనూ ఎలా సంబంధం కలిగి ఉందో ఈ రిపోర్ట్ విశ్లేషించింది. "దేశంలోని అగ్ర కులాలు జాతీయ సంపదలో గణనీయమైన అసమాన వాటాను కలిగి ఉన్నాయి. భారతీయ బిలియనీర్లు ఎక్కువగా ఉన్నత కులాల క్లబ్‌గా ఉన్నారు. ఒక ప్రగతిశీల సంపద పన్ను ప్యాకేజీ విధానం తక్కువ సంఖ్యలో ఉన్న అతి సంపన్న, ఉన్నత కుల కుటుంబాలపై మాత్రమే కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

ప్రతిపాదిత పన్ను విధానంతో అట్టడుగు కులాలు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది. దీని ద్వారా విపరీతమైన సంపద అసమానతలను పరిష్కరించడమే కాకుండా.. భారత్‌లోని సామాజిక, ఆర్థిక అసమానతల మధ్య దృఢమైన సంబంధాన్ని బలహీనపరచడంలో ఇటువంటి పన్నులు కీలక పాత్ర పోషించనున్నాయి." అని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ తన నివేదికలో స్పష్టం చేసింది.

ఆరోగ్యశ్రీ పై విషప్రచారం

- టిడిపి, బిజెపిలపై మల్లాది విష్ణు ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోలేదని, టిడిపి, బిజెపి కావాలని విషప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిన చరిత్ర టిడిపిదేనన్నారు. టిడిపి పాలనలో ఆరోగ్యశ్రీ నిధులన్నీ దుర్వినియోగం కాగా, వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రీన్ ఛానెల్ ద్వారా పారదర్శకంగా చెల్లిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా 42.91లక్షల మందికి రూ.13,471 కోట్ల విలువైన వైద్యసేవలందించామని పేర్కొన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వం నిర్వహించిందని, టిడిపి అధికారంలో ఉండగా ఎందుకు ప్రవేశపెట్టలేకపోయారో చంద్రబాబు సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు. నీత ఆయోగ్ విడుదల చేస్తున్న ఆరోగ్య సూచీల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు.

ఎసిబి వలలో రావులపాలెం సిఐ

ప్రజాశక్తి - ఆలమూరు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)



లంచం తీసుకుంటూ దొరికిపోయిన రావులపాలెం సిఐ ఆంజనేయులు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సిఐ ఆంజనేయులు ఎసిబి వలకు చిక్కారు. రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపిన వివరాల మేరకు... గత నెలలో కోడిపందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో కుచ్చర్లపాటి లక్ష్మణరాజు పట్టుబడ్డాడు. రౌడీషీట్ ఓపెన్ చేయకుండా ఉండాలంటే రూ.50 వేలు లంచం ఇవ్వాలని లక్ష్మణరాజును సిఐ ఆంజనేయులు డిమాండ్ చేశారు. వేధింపులు ఎక్కువ అవ్వడంతో ఎసిబి అధికారులను లక్ష్మణరాజు ఆశ్రయించారు. వారి సూచనల మేరకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మణరాజు లంచం ఇస్తుండగా దాడి చేసి సిఐ ఆంజనేయులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజమండ్రి ఎసిబి కోర్టుకు ఆయన్ను తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

పూర్తి పరిహారం, పునరావాసం ఇవ్వండి

- మెరుగైన వైద్యానికయ్యే ఖర్చు భరించండి
- పోలవరం పునరావాస బాధితుని ఆత్మహత్యాయత్నంపై సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వందశాతం పరిహారంతో పాటు తక్షణమే పునరావాసాన్ని ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధవళేశ్వరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద పునరావాస బాధితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. బాధిత రైతుకు తక్షణం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని, దానికయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. ఆ రైతు కుటుంబ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. మరిన్ని ఘటనలు జరగకముందే రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులందరికి 100 శాతం పరిహారాన్ని, పునరావాసాన్ని ఇవ్వాలన్నారు. ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిణామాలను వివరిస్తూ దేవీపట్నానికి చెందిన రైతు సీతారామయ్య రెండెకరాల భూమిని, ఇంటితోపాటు, తన మొత్తం ఆస్తిని ప్రాజెక్టుకోసం అర్పించారని తెలిపారు. పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ ఎనిమిదేళ్లుగా తిరుగుతున్నారని, 73 ఏళ్ల వయసులో ఇక తిరగలేక, విసిగి వేసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. తన సర్వస్వాన్ని ప్రాజెక్టు కోసం ఇచ్చిన ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నజరానా ఇదని ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశామని గత టిడిపి ప్రభుత్వం, నేటి వైసిపి ప్రభుత్వం డంభాలు పలుకుతున్నాయని, అయితే, పునరావాస బాధితులకు 20 శాతం కూడా పరిహారం అందలేదని తెలిపారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పునరావాస ప్యాకేజీతో సహా పోలవరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ బాధ్యతని, కుంటి సాకులు చెబుతూ నిధులివ్వడానికి తాత్సారం చేస్తోందని, పునరావాస బాధ్యత నుండి తప్పుకుంటోందని తెలిపారు. పునరావాస బాధితుల ప్రాణాలతో, బతుకులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మరిన్ని ఘటనలు జరగకముందే తక్షణం రాష్ట్ర ప్రభుత్వం పునరావాస బాధితులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరుతున్నట్లు తెలిపారు.

సిఐటియు తూ.గో. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ హఠాన్మరణం

ప్రజాశక్తి- రౌతులపూడి



రాజులోవ(ఫైల్)

సిఐటియు తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి రాజులోవ (39) శనివారం హఠాన్మరణం చెందారు. ఆయన స్వగ్రామైన రౌతులపూడి మండలం రామకృష్ణాపురంలోని తన సొంత పొలంలో మృతి చెందారు. ఆయనకు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. రాజులోవ స్వగ్రామమైన రామకృష్ణాపురంలో ఆదివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. బి రాజులోవ పెద్దాపురం మహారాణి కళాశాలలో ఉన్నత విద్య చదువుతున్న సమయంలో ఎస్ఎఫ్ఐ పట్ల ఆకర్షితులై ఆ సంఘంలో చేరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం సిఐటియు తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి అరుణ్, కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కె వెంకటేశ్వరరావు, అల్లూరిసీతారామరాజు జిల్లా కార్యదర్శి బి కిరణ్, సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్ రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెఎస్ శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్, సత్తిరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం గంగసూరిబాబు, వరహాలు తదితరులు రాజులోవ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శ్రీశైల మల్లన్నసేవలో మధ్యప్రదేశ్ సిఎం దంపతులు



ప్రజాశక్తి - శ్రీశైలం: శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. శ్రీశైలం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మోహన్‌యాదవ్‌కు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సిఎం దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సంపాదకీయం

ఆకలి... నరకపు వాకిలి

'ఆకలి...ఆకలి...తెరిచిన/ రౌరవ నరకపు వాకిలి/ హృదయపు మెత్తని చోటుల/ గీరే జంతువు ఆకలి/ బ్రహ్మాండం దద్దరిలి/ బ్రద్దలైన ఏదో ధ్వని' అంటాడు అలూరి బైరాగి. ఆకలి హోరు ముందు పిడుగైనా వినిపించదు. ఆకలి కమ్మిన కళ్లకు ప్రపంచమే కనిపించదు. పేదవాడి కడుపు కరువు తీర్చలేని నాగరికత ఇది. తల్లి గర్భం నుంచి ఈ భూమిపైకి అడుగుపెట్టిన క్షణం నుంచి భాష రాకపోయినా, బంధం అర్థం కాకపోయినా... ఆకలి బాధ మాత్రం అర్థమౌతుంది. ఈ భూమ్మీద ఆకలి తెలియని జీవి లేదు. ఆకలి తీర్చుకోడానికి నిరంతర పోరాటం తప్పనిసరి. ఆకలితో పోరాటం మనిషికి ఈనాటిది కాదు. ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా... జనం ఆకలి మాత్రం తీర్చలేకపోతున్నారు. అంతరిక్షంలోకి దూసుకుపోతున్న రోజుల్లోనూ నిత్యం పస్తులు, పసిబిడ్డల ఆకలి కేకలు... తగలబడుతున్న కాష్టం నుంచి వినిపించే చిటపటల్లా మండుతూనే వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 53 దేశాల్లో సుమారుగా 11.3 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. కనీసం ఒక్కపూట కూడా కడుపు నింపుకోలేని దుస్థితిలో వున్నారని సాక్షాత్తూ ఐరాసనే వెల్లడించింది. 'అసలు మనిషిని చైతన్యవంతంగా చేసేదేమిటో తెలుసా? ఆకలి. ఒక్క మనిషినే కాదు, సృష్టిలో ప్రతి జీవికీ కూడా... ఆకలి తీరిన మీదటే అన్నీ...' అంటారో రచయిత్రి.

'అన్నపు రాశులు ఒకచోట/ ఆకలి మంటలు మరోచోట/ హంస తూలికలు ఒకచోట/ అలసిన దేహాలొకచోట' అంటారు కాళోజీ. మోడీ ఏలుబడి మొదలైన ఈ పదేళ్లు... దేశం అనుభవిస్తున్న దురవస్థకు సజీవ సాక్ష్యాలు. మోడీ పాలనలో అదానీ, అంబానీలు దేశంలోనే అత్యంత శ్రీమంతులుగా చలామణి అవుతుండగా, పేదలు మరింత నిరుపేదలుగా మార్చివేయబడుతున్నారు. దేశ సంపదను సంపన్నులకు కట్టబెట్టే ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలే ఈ దుస్థితికి కారణం. చేసేందుకు ఉపాధి దొరకని పరిస్థితి, పని దొరికినా కరిగిపోతున్న నిజవేతనాలు వంటివాటితో సామాన్యులు కడుపునిండా తినలేకపోతున్నారు. తిన్నది కూడా పౌష్టికాహారం కాదు. పేదలు పట్టెడన్నం కోసం ఆకలి కేకలు పెట్టే దుస్థితికి దేశం చేరింది. గతంలో వున్న అంత్యోదయ కార్డులు నిరుపేదలకు, నిర్భాగ్యులకు ప్రయోజనకరంగా వుండేవి. రకరకాల నిబంధనలతో వాటిని అటకెక్కించారు. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ దారుణమైన స్థితికి పడిపోయింది. 2023 సంవత్సరానికి గానూ మొత్తం 125 దేశాలను పరిగణనలోకి తీసుకొంటే 28.7 హంగర్ స్కోరుతో భారత్ 111వ స్థానంలో నిలిచింది. గతేడాది ర్యాంకుతో పోలిస్తే నాలుగు స్థానాలు దిగజారింది. ఈ ఆకలి కేకలు ఏ మానవత్వానికీ వినబడవు. ఎండిన డొక్కల్లో అవి చేస్తున్న రణం... కార్పొరేట్ల దోపిడీ సాక్షిగా మరణ శాసనాల్ని లిఖిస్తోంది.


ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఆకలి, ఆహార అభద్రతతో పోరాడుతూనే ఉన్నారనేది కఠోర వాస్తవం. సాంకేతికత, వ్యవసాయంలో పురోగతి ఉన్నప్పటికీ, ప్రపంచం ఆకలి సంక్షోభంలో కూరుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు పది మరణాలలో ఒకరిది ఆకలి మరణంగా నమోదవుతోంది. 8.28 కోట్ల మంది ప్రజలు దీర్ఘకాలికంగా పోషకాహార లోపంతో ఉన్నారు. ఈ గణాంకాలు భయంకరమైన వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అవినీతి, అన్యాయం, మతోన్మాదం అలుముకున్న ఈ దేశం గమ్యం ఎటువైపు? ఈ దేశం నిజంగానే వికసిత్ భారత్ కావాలంటే-రైతులను శక్తివంతం చేయడం, సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఆకలిని నిర్మూలించడంలో కీలకమైన దశలు. సామాజిక న్యాయం, ఆర్థిక స్థిరత్వం రెండింటినీ ప్రోత్సహిస్తూ, ఈ భూమ్మీద ఉన్న ప్రతి వ్యక్తికి పౌష్టికాహారం అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రతి యేడాది మే 28న నిర్వహించే 'ప్రపంచ ఆకలి దినం' ఆకలి యొక్క వినాశకర ప్రభావాన్ని గుర్తు చేయడమే కాదు, మార్పునకు ఉత్ప్రేరకం కావాలి. 'ఆకలి దహిస్తూండబట్టి గానీ లేపోతే నేనూ/ ఈ ఉభయ సంధ్యల రంగులతో నా మానసాన్ని/ సింగారించుకుని వుందును' అంటారో కవి. ఆకలి, దాని వినాశకరమైన పరిణామాల నుంచి బయటపడి ప్రతి ఒక్కరూ సమున్నతంగా జీవించే ఆకలిలేని ప్రపంచం కోసం కృషి చేయాలి. అందుకు తగిన విధంగా ప్రభుత్వాల విధానాలను మార్చాలి.

మహనీయుల మాట



మనం ప్రజలకు ఏమీ బోధించజాలం. అయితే వారు తమంతట తామే వాటిని కనిపెట్టేలా సహాయపడగలం.

- బెంజమిన్ ఫ్రాంక్లిన్,
రచయిత, శాస్త్రవేత్త, ఆవిష్కర్త.



విధానాలే ప్రధానంగా ఎన్నికల పోరాటం

ప్రస్తుతం



తెలకపల్లి రవి



ఎన్నికల పోరాటంలోనూ పోలింగ్ అనంతరం కూడా ఉద్రిక్తతలు పెంచడానికి రకరకాల పాచికలు వేసినా ప్రజలు ప్రశాంతత కాపాడుకున్నారు. రేపు తుది తీర్పు వెలువడే వరకూ ఇదే చైతన్యంతో అప్రమత్తతతో వుండాలని కోరుకుందాం. పాలక వర్గాలు రాజకీయ ప్రయోజనాల కోసం, పదవుల కోసం రగిలించిన వివాదాలు, సృష్టించిన వైరాలూ, వివాద విద్వేషాలు పక్కకు నెట్టి ప్రజల ఐక్యత కాపాడుకోవాలి. పదేళ్లు పూర్తి చేసుకుంటున్న విభజిత రాష్ట్రాల సమస్యలు పరిష్కరించుకుంటూ మత రాజకీయాలను ఆమడ దూరం కొట్టడానికి మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. అందుకు విరుద్ధమైన సంకుచిత పోకడలూ అల్పిష్టి తగాదాలను దూరం కొడదాం.

తీవ్ర స్థాయిలో జరిగిన ఎన్నికల పోరాటం ముగింపు దశకు చేరుకుంది. వచ్చే ఆదివారం లోగానే ఎగ్జిట్ పోల్స్ వచ్చేస్తాయి. స్థూలంగా రాజకీయ చిత్రం గోచరమవుతుంది. ఎందుకంటే 2024 ఎన్నికల పోరాటం వివిధ పక్షాలకు పెద్ద సవాల్‌గానే మారింది. లౌకికతత్వం, కేంద్ర పెత్తనం, మోడీ నిరంకుశ పోకడలు పెద్ద చర్చకే దారితీశాయి. తెలుగు రాష్ట్రాలలో ఎ.పి ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మళి విజయమా లేక చంద్రబాబు నాయుడు ఎన్‌డిఎ పునరాగమనమా అన్నది దేశవ్యాపిత ఆసక్తి నెలకొంది. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ స్థానాలలో ఆధిక్యత సాధించి స్థిరపడుతుందా, బిఆర్‌ఎస్ భవిష్యత్ ఎలా వుంటుంది, బిజెపి పెరుగుతుందా అన్న అంశం కూడా ఉత్కంఠ కలిగించింది. జాతీయ స్థాయిలో బిజెపి ఎన్‌డిఎ కూటమి, కాంగ్రెస్ 'ఇండియా' వేదిక, ప్రాంతీయ పార్టీలూ వామపక్షాలూ హోరాహోరీగా తలపడిన ఈ పోరాటంలో ప్రజల తీర్పు ఎలా వుంటుందనేది జూన్ నాలుగున తేలిపోతుంది. దీనిపై పలురకాల విశ్లేషణలు, సర్వేలు, అంచనాలు, వాదోపవాదాలు, తిట్లూ శాపనార్థాలూ సాగిపోతున్నాయి. బహుశా ఫలితాల తర్వాతా ఈ వాతావరణం కొద్ది రోజులపాటు కొనసాగుతుంటుంది. ఈ నేపథ్యంలో మౌలికంగా మీడియా సంస్థల, సంఘాల, నేతల పాత్ర ఏంటి అన్నది ఇప్పుడు మనం తేరిపార చూసే అవకాశమేర్పడింది. ఫలితాలతో నిమిత్తం లేకుండా ఈ ఎన్నికల పోరాటం నేర్పిన పాఠమేంటి అన్నది చెప్పుకునే సందర్భం ఇది.

వ్యవస్థలు, విధానాల చర్చ

ఈ ఎన్నికల పోరాటం వివాదాల నుంచి విధానాల వైపు, వ్యక్తుల నుంచి వ్యవస్థల వైపు మరలించడం సైద్ధాంతిక శక్తుల తొలి విజయం. ఓసారి వెనక్కు తిరిగి చూస్తే విశ్వగురు మోడీ విజయ యాత్రలా మార్చి 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' (ఈ సారి నాలుగు వందల సీట్లు) అంటూ హంగామాగా మొదలైంది. ఇప్పుడెవరూ ఆ మాట అనడం లేదు. అసలు ఆ మాటే మాది కాదు, ప్రజల నుంచి తీసుకున్నామని మోడీనే చెప్పుకోవలసిన స్థితి. బిజెపికి బాగా అనుకూలంగా మాట్లాడే సంస్థలూ వ్యక్తులూ కూడా ఏదో విధంగా మెజార్టీ వస్తుందని సరిపెడుతున్నారు. ప్రశాంత్ కిషోర్, సి ఓటర్ యోగేంద్ర దేశ్‌ముఖ్, యోగీంద్ర యాదవ్ ఇలా రకరకాల వ్యక్తులను తీసుకుంటే 300కు దగ్గరగా సరిపెడుతున్నారు. తాజాగా అంచనాలు విడుదల చేసిన యోగేంద్ర యాదవ్ కూడా బిజెపికి మెజార్టీ రాదంటూనే మిత్రపక్షాలతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చని చెబుతున్నారు. అమెరికా నుంచి కూడా కొందరు మేధావులు తరలి వచ్చి మోడీ విజయం అంటూ అంచనాలు ప్రకటించి వెళ్లారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో బంధమే దెబ్బ తీస్తుందన్న భయంతో బిజెపితో దానిపై ఆధారపడి లేదని నడ్డాతో అనిపించి మరో నాటకం నడిపించారు. మరో వంక బిజెపి యేతర ప్రభుత్వమే వస్తుందని 'ఇండియా' వేదిక నాయకులంటున్నారు. కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, జైరాం రమేష్, చిదంబరం వంటి వారు ఆ మేరకు వివరంగా ప్రకటనలు చేశారు. బిజెపికి పోటీ కాంగ్రెస్ మాత్రమేనన్న వాదనలూ తగ్గి 100-125 దాటవని చెబుతున్నారు. మరో వంక మమతా బెనర్జీ వంటి అవకాశవాదులు తాము 'ఇండియా'ను బయటి నుంచే బలపరుస్తామంటూ తదుపరి ఎత్తులకు అవకాశం అట్టి పెట్టుకుంటున్నారు. చంద్రబాబు నేరుగా పొత్తు పెట్టుకోగా జగన్ వంటి వారు తమపై ఆధారపడి మోడీ రావాలని కలలు కంటున్నారు. ఏతావాతా వీరంతా కూడా బిజెపి ప్రత్యక్ష, పరోక్ష దోస్తులే గనక ఎలాగో సర్కారులోకి వస్తామని మోడీ, అమిత్ షా వంటి వారు ఆశలు పెట్టుకున్నారు. యు.పి లో సమాజ్‌వాదీ పార్టీ బాగా పుంజుకోవడం, బీహార్‌లో తేజస్వి యాదవ్ నాయకత్వంలో 'ఇండియా'కు మెరుగైన అవకాశాలు, కర్ణాటకలో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో వుండటం సానుకూల అంశాలుగా భావిస్తున్నా రెండు ప్రధాన పార్టీలూ పోటీ పడే హిందీ రాష్ట్రాలలో ఏం జరుగుతుందనేది తేలని అంశమే. మహారాష్ట్రలో వివిధ ప్రాంతీయ పార్టీలలో చీలిక వర్గాలు సృష్టించి బిజెపి కొంచెం అనుకూలత తెచ్చుకున్నట్టు కనిపిస్తుంది. తమిళనాడు, కేరళ కూడా స్పష్టంగా ఎన్‌డిఎకు అవకాశమే లేని రాష్ట్రాలుగా వున్నాయి. ఈ విధంగా చూస్తే మోడీ మోతకు చిల్లు పడిందనేది స్పష్టమే. అంతేగాక ఆయన విశ్వగురు ముసుగు తీసేసి నేరుగా విద్వేష వాక్కులలోకి దిగవలసి వచ్చింది. ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై చివరకు ఎంతో కొంత ఎన్నికల సంఘమే స్పందించవలసి వచ్చింది. అయితే ఎన్నికల సంఘం పాత్రపై ఇప్పటికీ నీలినీడలు అలుముకునే వున్నాయి. 17సి ఫారం ప్రకారం పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్లు వేసిన వారి సంఖ్యను బహిర్గతం చేయడానికి ఎన్నికల సంఘం నిరాకరిస్తున్నది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతల మతతత్వ ప్రచారాన్ని, ఇతర పార్టీల నేతల ప్రతి విమర్శనూ ఒకే గాట కడుతున్నది. ఎ.పి లో మాచర్ల ఘటనలతో సహా అనేక సందర్భాల్లో ఎన్నికల సంఘ వ్యవహార శైలి విమర్శల పాలైంది. తెలంగాణ క్యాబినెట్ సమావేశానికి కూడా అనుమతించకుండా వివక్షకు పాల్పడింది. రేపటి ఫలితాల తర్వాత ఈ అంశాలన్నీ కూడా ముందుకు రానున్నాయి.

ఎ.పి, తెలంగాణల దృశ్యం

ఆంధ్రప్రదేశ్ లోనైతే కేవలం టిడిపి, వైసిపి మధ్య యుద్ధంగా ఇంకా చెప్పాలంటే జగన్, చంద్రబాబు పోరాటంగా మొదలైంది. చంద్రబాబు అరెస్టు, కేసుల తర్వాత ఇది పరాకాష్టకు చేరింది. ఈ మధ్యలో బిజెపి, ఎన్‌డిఎలో భాగమైన జనసేన పవన్ కళ్యాణ్ అసలు కేంద్రం ఊసే లేకుండా కేవలం వైసిపి వ్యతిరేక ఓట్లు చీలనివ్వకపోవడం అంటూ కొత్త పాట తెచ్చారు. బిజెపితో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నా విడిగా లౌకిక పార్టీలూ ఆయనతో కలవ వచ్చునే పల్లవీ కొన్ని వైపుల నుంచి వినిపించింది. జగన్‌తో ఆస్తి వివాదాల కారణంగా దూరమైన షర్మిల తెలంగాణ నుంచి ఎ.పి కాంగ్రెస్‌లో ప్రవేశించారు. ఈ పరిస్థితుల్లోనే సిపిఎం ఇతర లౌకిక ప్రజాస్వామికవాద శక్తులతో కలసి బిజెపితో జట్టు కట్టిన టిడిపి కూటమి, నిరంతరం బలపర్చే వైసిపి రెంటినీ ఓడించాలనే విధానంతో 'ఇండియా' ఆవిర్భావానికి కృషి చేసింది. ఈ క్రమంలోనే వామపక్షాలూ కాంగ్రెస్ కలసి పోరాడాయి. రాజధానికి సహాయం, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, పోలవరం, విభజన హామీలు, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలు తెర మీదకు వచ్చాయి. ఆఖరుకు షర్మిల కూడా చంద్రబాబు, జగన్ బిజెపికి లోబడిపోయారనే అంశం నొక్కి చెప్పారు. పోలింగ్ చివరి దశలో మల్లికార్జున ఖర్గే, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా వంటి వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఎన్నికల పోరాట స్వరూపం మారింది. ముస్లిం రిజర్వేషన్లపై మోడీ బిజెపి వైఖరిని చంద్రబాబు, జగన్ ఉభయులూ తోసిపుచ్చవలసి వచ్చింది. విశాఖ ఉక్కుపై ఎన్నికల ఫోకస్ మారిందని 'హిందూ' వంటి పత్రిక రాసింది. ఇదంతా మొదట బయలుదేరిన నాటి తీరుకు భిన్నమైన సన్నివేశమే. తెలంగాణలోనూ బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకే పరిమితమైన రాజకీయ రణం కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం (భువనగిరి మినహా) కలసికట్టుగా కదలడంతో కొత్త రూపు తీసుకున్నది. 'ఇండియా' వేదిక, బిజెపి, బిఆర్‌ఎస్ త్రిముఖ సమరంగా మారింది. ఇదే ఇప్పుడు శాసనమండలి ఉప ఎన్నికలలోనూ కొనసాగుతున్నది. గతంలో ఎవరు ఏం మాట్లాడారనే మీమాంస కన్నా లౌకిక శక్తులు దేశవ్యాపితంగా చేస్తున్న పోరాటంలో తెలంగాణ భాగం కావడం, బిజెపిని ఓడించడం కీలకమనే వాస్తవికత సిపిఎం ప్రదర్శించింది. ముఖ్యమంత్రి రేవంత్‌ది బిజెపి పట్ల మెతక వైఖరి అంటూ వచ్చిన అభిప్రాయాలను స్వయంగా తోసిపుచ్చవలసి వచ్చింది. విచిత్రమేమంటే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజకీయ పునస్సమీకరణ జరుగుతుందని, రేవంత్ బిజెపిలోకి వెళతారనీ బిఆర్‌ఎస్ ఇప్పటికీ ప్రచారం చేస్తున్నది. మరో వైపున బిఆర్‌ఎస్ లోంచి 25 మంది ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ లోకి వెళతారని కిషన్‌రెడ్డి అంటున్నారు. రాజకీయ దుమారం ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణలు చాలు. ఎ.పి లో ఎవరు అధికారంలోకి వస్తారనే దానిపైనా తెలంగాణలో ఎవరికి ఎక్కువ స్థానాలు వస్తాయనే దానిపైనా ఇప్పటికీ రెండు రకాల అంచనాలు హోరాహోరీగా సాగుతూనే వున్నాయి. ఆ జోస్యాలతో నిమిత్తం లేకుండా ఒక రాజకీయ వాతావరణం తేవడమే వామపక్షాలు సాధించిన సత్ఫలితం. ఇందుకు ఇతర లౌకిక ప్రజానుకూల శక్తుల సహకారం లభించింది.

మీడియా ద్వంద్వత్వం

తెలుగు మీడియాలో మొదటి నుంచి పాలక వర్గాల ప్రాబల్యం ఏదో ఒక వర్గాన్ని భుజాన మోయడం పరిపాటి. వర్తమాన ఘట్టంలో మరీ బాహాటంగా రెండుగా చీలిన మీడియా వైసిపి, టిడిపి, బిజెపి మధ్య మొగ్గును చూపించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మీడియాపై ఆగ్రహానుగ్రహాలు బాహాటంగానే ప్రదర్శించాయి. ప్రాంతీయ అధికారం తప్ప జాతీయ రాజకీయాల స్పృహ కూడా వదలిపెట్టి వారినో వీరినో గెలిపించడమే లక్ష్యంగా పాక్షిక చిత్రం ఇచ్చింది. తమకు నచ్చిన, చూపిన అంశాల విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేసింది. రాజ్యాంగ అంశాలను కూడా స్థానిక రాజకీయ కోణంతోనే చిత్రిస్తూ ప్రజల దృష్టిని దారి మళ్లించింది. ఉద్యమాలనూ, బహిరంగ విషయాలను కూడా తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఇటో అటో ఇస్తూ వచ్చింది. కుల మత ధోరణులు, అసభ్య దూషణలు,

ఈ ఎన్నికల పోరాటం వివాదాల నుంచి విధానాల వైపు, వ్యక్తుల నుంచి వ్యవస్థల వైపు మరలించడం సైద్ధాంతిక శక్తుల తొలి విజయం. ఓసారి వెనక్కు తిరిగి చూస్తే విశ్వగురు మోడీ విజయ యాత్రలా మార్చి 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' (ఈ సారి నాలుగు వందల సీట్లు) అంటూ హంగామాగా మొదలైంది. ఇప్పుడెవరూ ఆ మాట అనడం లేదు. అసలు ఆ మాటే మాది కాదు, ప్రజల నుంచి తీసుకున్నామని మోడీనే చెప్పుకోవలసిన స్థితి. బిజెపికి బాగా అనుకూలంగా మాట్లాడే సంస్థలూ వ్యక్తులూ కూడా ఏదో విధంగా మెజార్టీ వస్తుందని సరిపెడుతున్నారు.

అమానుష దాడులూ నిత్యకృత్యంగా మారాయి. అక్రమ ధనం వికటాట్టహాసం చేసింది. సైద్ధాంతిక నిబద్ధత లేకుండా బిజెపిని మోసిన జనసేన అధినేత సినిమా అభిమానాల నేపథ్యం కూడా చర్చను పక్కదోవ పట్టించడానికి కారణమైంది. విస్తారంగా పెరిగిన సోషల్ మీడియా సోపానంగా అప్రధాన వివాదాలే సమయాన్ని బుర్రలనూ ఆక్రమించి వాతావరణాన్ని కలుషితం చేశాయి. ఇంతటి పరిస్థితిలోనూ ఎంతో కొంత చర్చ పట్టాలపై వుందంటే దానికి కారణం 'ప్రజాశక్తి' వంటి నిబద్ధ పత్రికలు, ప్రజాపక్ష ఉద్యమాలు, శక్తులూ నిర్వహించిన విస్పష్టమైన పాత్ర మాత్రమే. ఎన్నికల పోరాటంలోనూ పోలింగ్ అనంతరం కూడా ఉద్రిక్తతలు పెంచడానికి రకరకాల పాచికలు వేసినా ప్రజలు ప్రశాంతత కాపాడుకున్నారు. రేపు తుది తీర్పు వెలువడే వరకూ ఇదే చైతన్యంతో, అప్రమత్తతతో వుండాలని కోరుకుందాం. పాలక వర్గాలు రాజకీయ ప్రయోజనాల కోసం, పదవుల కోసం రగిలించిన వివాదాలు, సృష్టించిన వైరాలూ, వివాద విద్వేషాలు పక్కకు నెట్టి ప్రజల ఐక్యత కాపాడుకోవాలి. పదేళ్లు పూర్తి చేసుకుంటున్న విభజిత రాష్ట్రాల సమస్యలు పరిష్కరించుకుంటూ మత రాజకీయాలను ఆమడ దూరం కొట్టడానికి మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. అందుకు విరుద్ధమైన సంకుచిత పోకడలూ అల్పిష్టి తగాదాలను దూరం కొడదాం. ప్రగతిశీల శక్తుల ఐక్యతే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ. ■

కందుకూరి జీవితమంతా కదనరంగమే

సందర్భం



యస్.ఎన్.రమేష్



ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే మూఢనమ్మకాలు ఎంత తక్కువ వుంటే ఆ దేశం అంతగా అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని నమ్మిన ప్రజ్ఞాశాలి. తను నమ్మిన ప్రతి అంశాన్ని ఆచరణలో పెట్టిన ధీశాలి. స్త్రీలను సమానంగా గౌరవించే కాలం, మూఢనమ్మకాలు నశించిపోయే స్థితి, అవినీతి లేని రాజకీయాలు, వ్యవస్థలు ఏర్పడే వరకూ ఆదర్శనీయుడే.

మే 27 కందుకూరి 105వ వర్ధంతి

సంఘ సంస్కర్తగా, నవయుగ వైతాళికుడిగా, స్త్రీ విద్య కోసం పాటుపడిన, మూఢాచారాలకు వ్యతిరేకంగా జీవితాన్ని గడిపిన కందుకూరి వీరేశలింగం బహుముఖ ప్రజ్ఞావంతుడు.

సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతుల ఏకైక సంతానంగా 1848 ఏప్రిల్16న రాజమహేంద్రవరంలో వీరేశలింగం జన్మించాడు. కార్యసాధకుడు, సాహసిగా జీవించిన కందుకూరి 1919 మే27న మద్రాస్‌లో మరణించారు. వీరేశలింగం జన్మించే నాటికి తెలుగునాట మూఢాచారాలు, చాందసవాదంతో నిండిపోయి ఉంది. ఒకవైపు ఎనిమిది సంవత్సరాల బాలికలకు 60 సంవత్సరాలకు పైబడిన ముసలి వాళ్ళతో పెళ్లిళ్లు జరిగేవి. బాలికలు యుక్త వయస్కులు అయ్యేటప్పటికి వైధవ్య ప్రాప్తి, ఆ తర్వాత బోడి గుండ్లు చేయించి తెల్లచీరలు కట్టబెట్టి కురూపులను చేసేదీ సమాజం. ముండలని, రండలని పిలుస్తూ ఈసడింపులు, ఛీత్కారాలు. ఇంటా, బైటా కూడా అన్ని సామాజిక కార్యకలాపాల నుండి బహిష్కారాలు.

మూఢాచారాలను మాటల్లో వ్యతిరేకించడం మాత్రమే చేయకుండా ఆచరించి చూపాడు వీరేశలింగం. కోరంగిలో ఇంగ్లీషులో హెడ్మాస్టర్ గిరీలో అమావాస్య రోజున చేరి అక్కడ పూర్వాచార పారాయణుల్ని, పెద్దల్ని ఆశ్చర్యపరిచాడు. తన ఖగోళ, జ్యోతిష్యాది శాస్త్ర పరిజ్ఞానంతో వారి పిడివాదాన్ని కొట్టిపారేశాడు. ఆరోజు కూడా తక్కిన రోజుల్లాంటిదేనని వాదించాడు. సనాతన సాంప్రదాయవాది అయిన తన తల్లి మాటను కాదనలేక వీరేశలింగం ఓ భూతవైద్యుడ్ని ఇంట్లోకి రానిచ్చాడు. అంధ విశ్వాసాలను అడ్డంపెట్టుకుని ఆవిడ దగ్గర నుంచి డబ్బు గుంజాలన్న ప్రయత్నాన్ని వీరేశలింగం అడ్డుకున్నాడు. మూఢ విశ్వాసాలను పోగొట్టాలంటే ప్రకృతి శాస్త్ర విజ్ఞానాన్ని వ్యాప్తి చేయటం అవసరమని వీరేశలింగం నాడే గుర్తించారు. అందుకోసం పదార్థ వివేక శాస్త్రాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో అనువదించి ముద్రించారు. తెలుగులో ప్రకృతి శాస్త్రాలు లేని లోపాన్ని నివారించడానికి కొంత కృషి చేశారు.

మన దేశంలో శాస్త్ర విజ్ఞానం వెనుక పట్టు పట్టడానికి గల కారణాన్ని ఇంటి పెరటిలో ఉన్న అరటి చెట్టుకి కొసనుండిగాక మధ్య నుండి చీల్చుకొని వచ్చిన పూవుకు వేసిన గెల అరిష్టదాయకమని, అందువలన ఆ చెట్టును కొట్టించి వేయమని చాలామంది చెప్పారు. వారి మాటలను వీరేశలింగం పట్టించుకోలేదు. ఇంటి దూలానికి పట్టిన తేనెపట్టు అశుభ సూచికమని పలువురు పలు విధాలుగా చెప్పారు. వీరేశలింగం వినలేదు. మంచి రోజు చూసుకుని ఉద్యోగంలో చేరమని ఇంటిలోని వారు, బంధువులు బతిమాలారు. కాని ఆయన అమావాస్య నాడు ఉద్యోగంలో చేరాడు. ఆయన మద్రాస్‌లో ఉండగా చారల గుర్రం కొన్న యజమానికి "ప్రాణగండం" ఉందని అందరూ భయపడ సాగారు. వీరేశలింగం దానిని చౌకగా కొని పగలు రేయి దాని సేవలు పొందారు. ఇలాంటి నిర్దిష్టమైన ఆచరణ అనుయాయులకు ఆయన పట్ల విశ్వాసాన్ని పెంచింది.

ప్రతి స్త్రీకి విద్య విలువైన ఆభరణం అని నమ్మాడు. "స్త్రీ విద్య హిందూ శాస్త్ర సమ్మతము కాదని, పూర్వాచార విరుద్ధమని, స్త్రీ విద్యాభ్యాసం వలన కీడు మూడునను వాదములు...సహజ ప్రవీణురాలైన స్త్రీలపై ఆధిపత్యం కొరకు చేయు అధర్మ ప్రేలాపనలని, వీటిని తిరస్కరించాలి." అన్నాడు.

స్త్రీల స్థితి బాగుపడనిదే దేశం బాగుపడదని విశ్వసించిన వీరేశలింగం వారిని చైతన్యవంతుల్ని చేసేందుకు విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించారు. వీరేశలింగం బాలికల పాఠశాలలను నిర్మిం చారు. స్త్రీ ఉపాధ్యాయుల్ని నియమించారు. 13 సంవత్సరాల లోపే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేయాలనే ఆచారం పేరుతో కన్యాశుల్కం తీసుకుని ఆడపిల్లలకు ముసలివారికి పెళ్లిళ్లు చేసేవారు. కొద్ది కాలంలో భర్త చనిపోతే స్త్రీలను భౌతిక, మానసిక హింసకు గురిచేసి కృంగి కృశించిపోయేలా చేస్తున్న దయనీయ స్థితిని పోగొట్టడం కోసం వితంతు వివాహాలు చేసే ఉద్యమాన్ని వీరేశలింగం సాగించారు. 112 వితంతు వివాహాలను చేయించారు. ఆయన కృషికి ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. అయినా పట్టుదలగా ప్రయత్నం చేశారు. అనేక మంది యువతీ యువకులతో పాటు వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మమ్మ ఈ కృషిలో ఎంతో ఆదర్శంగా వెన్నుదన్నుగా నిలిచారు.

నినాదాలకు పరిమితమైన రాజకీయాల వలన నిర్దిష్టమైన కార్యాచరణగల సంస్కరణ ఉద్యమాలు వెనుకపట్టు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలు, సంఘసంస్కరణ రెండూ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందాలని "జీవిత చరిత్ర" చేసిన 'విజ్ఞాపనము'లో ఆకాంక్షించారు. 'రాజ్యాంగ పరమైన స్వాతంత్ర్యం వలన ఉపయోగముందనుట ఒక మధుర స్వప్నం. ఆ కల నిజం కావాలంటే మనం కుల, మత, భాషాపరమైన సంస్కరణలు అవలంభించాలి. సంఘంలో ఐక్యతకు సంస్కరణ ఉద్యమం తోడ్పడుతుంది. అలాంటి ఐకమత్యంతో మనం అభివృద్ధి సాధించగల'మని నమ్మిన మార్గదర్శి కందుకూరి.

సమాజ హితం కోసం వీరేశలింగం సాహిత్యాన్ని మహత్తర సాధనంగా ఎంచుకున్నారు. తెలుగు నాటకాలు రాయటం 1860లోనే ప్రారంభమైనా తొలి ప్రదర్శన మాత్రం 1880లో జరిగింది. "వ్యవహార ధర్మబోధిని" అనే పేరుతో వీరేశలింగం తొలి రంగస్థల ప్రదర్శనతో ప్రథమ ఆధునిక ఆంధ్ర నాటక ప్రయోక్తగా గుర్తింపు పొందారు. శతాధిక గ్రంథకర్త అయిన వీరేశలింగం నాటక రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆ మహనీయుని జయంతి రోజైన ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవంగా కళాకారులు స్వచ్ఛందంగా జరుపుకుంటున్నారు.

సాహిత్య రచనల కృషిలో తొలి వికట కవిత్వం, తొలి వ్యంగ్య పరిహాస రచన, తొలి సాంఘిక నాటకం, తొలి నవల ఇలా అనేకానేక సాహితీ ప్రక్రియలలో తన చెరగని ముద్రను వేసుకుని తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఎన్నెన్నో ఆంగ్ల నాటకాలు అనువదించడమే కాక కాళిదాసు సంస్కృత నాటకం అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, హర్షుని రత్నావళి వంటి రచనలను తెలుగులోకి అనువదించారు. స్వతంత్రంగా పలు పౌరాణిక, సాంఘిక నాటకాలు రాశాడు కందుకూరి. పూజలు, వ్రతాల పట్ల విముఖత ఉండేది. జంధ్యం తీసివేశారు. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలు పాటించారు.

ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే మూఢనమ్మకాలు ఎంత తక్కువ వుంటే ఆ దేశం అంతగా అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని నమ్మిన ప్రజ్ఞాశాలి కందుకూరి. తను నమ్మిన ప్రతి అంశాన్ని ఆచరణలో పెట్టిన ధీశాలి. స్త్రీలను సమానంగా గౌరవించే కాలం, మూఢనమ్మకాలు నశించిపోయే స్థితి, అవినీతి లేని రాజకీయాలు, వ్యవస్థలు ఏర్పడే వరకూ ఆదర్శనీయుడే. ఆయన అందించిన స్ఫూర్తిదాయకమైన జీవితం మనకు ఆదర్శవంతమైంది, మార్గదర్శకమైనది. ఆయన లేవనెత్తిన, ప్రశ్నలు సంధించిన సమస్యలు నేటికీ సజీవంగా వున్నాయి. వాటి పరిష్కార మార్గాలతో ముందుకు అడుగెయ్యడమే ఈ సందర్భంగా ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి.

/ వ్యాసకర్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు,
సెల్ : 9490098539 /

జనవాక్యం

నియంత్రణ లేని పుస్తకాల ఫీజు

త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రచారం, ప్రవేశాలు, ఫీజు వసూలు ప్రారంభమయ్యింది. ఫీజులు పట్ల నియంత్రణ లేకపోవడం వల్ల మధ్య తరగతి తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. ఫీజులతో పాటు "పుస్తకాల ఫీజు" భారీగా వసూలు చేయడం చాలా అన్యాయం. అవసరం లేని పుస్తకాలను ప్రైవేట్ పబ్లికేషన్స్, నోట్స్‌ల పేరుతో పుస్తకాలు ధరకు రెట్టింపు ధరగా చేసి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో దోపిడీ జరుగుతుంది. విద్యార్థుల వయస్సు, మానసిక స్థితిని అర్థం చేసుకోకుండా ధనార్జనే ధ్యేయంగా జరుగుతున్న ఈ వ్యవహారం ప్రజలకు గుదిబండగా మారింది. "బుక్ ఫీజు" పేరుతో భారీగా వసూలు చేస్తున్న విధానాన్ని అరికట్టాలి. తాము చేస్తున్న దోపిడీ బయట పడకూడదని పుస్తకాల ఫీజును లెక్కల్లో చూపించకపోవడం, రసీదు ఇవ్వకపోవడం వంటి అంశాలు ఈ దోపిడీకి సాక్ష్యం.

- బి. సురేష్,
అరసవిల్లి గ్రామం,శ్రీకాకుళంజిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com






ఢిల్లీలోని వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం సిరా చుక్క చూపిస్తున్న సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కుటుంబం

సమైక్యత, సామరస్య పరిరక్షణకే ఓటు : ఏచూరి

- ఢిల్లీలో ఓటు హక్కు వినియోగించుకున్న కరత్ దంపతులు

న్యూఢిల్లీ: సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శనివారం ఢిలీల్లో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆయన ఉదయాన్నే పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి ఓటు వేశారు.

అనంతరం ఏచూరి మాట్లాడుతూ, దేశం కోసం,రాజ్యాంగ పరిరక్షణ కోసం, భారత దేశ ఐక్యత, సామరస్యాన్ని కాపాడడం కోసం ఓటు వేశాను అని చెప్పారు. సీతారాం ఏచూరితోబాటు ప్రకాశ్ కరత్, బృందాకరత్ కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ బూత్‌లో ఓటింగ్ మెషిన్ మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్‌కు కొద్ది సేపు అంతరాయమేర్పడింది. ఉదయం 9.15 గంటలకే ఓటింగ్ మెషిన్ బ్యాటరీ డౌన్ అవడం వల్ల 30 నిమిషాలసేపు పనిచేయలేదు. దీనిపై బృందా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది.

సైద్ధాంతిక పోరాటమిది : రాహుల్

న్యూఢిల్లీ : అసత్యాలు, విద్వేషాగ్ని రాజేస్తూ బిజెపి సాగిస్తున్న దుష్ప్రచారానికి, రాజ్యాంగ రక్షణ కోసం 'ఇండియా' ఫోరానికి మధ్యన జరుగుతున్నది సైద్ధాంతిక పోరాటమని రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి, తన తల్లి అయిన సోనియా గాంధీతో కలిసి రాహుల్ ఢిల్లీలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు తొలి ఐదు విడతల్లో అసత్యాలను, ద్వేషపూరిత ప్రచారాలను తిరస్కరించారని తెలిపారు. ఆరవ దశ ఓటింగ్‌లోనూ ఇదే ప్రతిబింబించిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ఓటు ప్రధానమైనదన్నారు. ప్రజాస్వామ్య పండుగలో అమ్మతో కలిసి పాల్గొనడం గొప్ప అనుభూతి ఇచ్చిందన్నారు.

నియంతృత్వానికి వ్యతిరేకంగా ఓటు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఆరో దశ పోలింగ్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చాందినీ చౌక్ లోక్‌సభ నియోజకవర్గంలో సివిల్ లైన్స్ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చి ఓటు వేశాను. అనారోగ్యం కారణంగా మా అమ్మ పోలింగ్ కేంద్రానికి రాలేకపోయారు. నేను నియంతృత్వానికి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఓటు వేశాను. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కూడా ట్వీట్ చేశారు.

ఓటు వేసిన ప్రముఖులు

ప్రజాశకి- న్యూఢిల్లీ :

ఆరో దశ పోలింగ్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖ క్రీడాకారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్, ఆయన సతీమణి సుదేశ్ క్యూలైన్లో నిల్చొని ఓటు వేశారు.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, ఆమె తనయుడు రాహుల్ గాంధీ నిర్మాణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.. పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్, తూర్పు ఢిల్లీ ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్లు కపిల్ దేవ్, ఎం ఎస్ ధోని ఢిల్లీ మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిశీ, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఉదయాన్నే వెళ్లి ఓటేశారు.ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హర్యానా సిఎం నాయబ్ సింగ్ సైనీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి) రాజీవ్ కుమార్ శనివారం ఓటు హక్కు వినియోగించుకున్నవారిలో ఉన్నారు.. జమ్మూ కాశ్మీర మాజీ ముఖ్యమంత్రి, అనంత్‌నాగ్- రాజౌరి లోక్‌సభ నియోజకవర్గ పిడిపి అభ్యర్థి మెహబూబా ముఫ్తీ కూడా ఓటు వేసిన వారిలో ఉన్నారు.

రెమాల్ తుపాను నేపథ్యంలో

కోల్‌కతా విమానాశ్రయం మూసివేత

కోల్‌కతా: రెమాల్ తుపాను ప్రభావం వల్ల పెనుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధనా సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆదివారం అర్థ రాత్రి నుండి సోమవారం ఉదయం 9 గంటల వరకు మూసివేయనున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. తుపాను ఆదివారం అర్ధ రాత్రికి బంగ్లాదేశ్‌లోని ఖేవుపరా , పశ్చిమ బెంగాల్‌లోని సాగర్‌దీవుల మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉన్నందున ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు బెంగాల్ రాష్ట్ర అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

వాగులో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట(పల్నాడు జిల్లా)

పొలానికి నీరు పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాలకు చెందిన పరుచూరి శ్రీనివాసరావు (50) తనకున్న 70 సెంట్లలో పశు వుల మేతకోసమని జొన్న (చొప్ప దంటు) సాగు చేశారు. దీనికి నీరు పెట్టేందుకు చిలకలూరిపేట పట్టణంలోని గాంధీపేటకు చెందిన వరగాని వెంకట్రావు (42)ను వెంట తీసుకెళ్లారు. పొలానికి మోటారు ద్వారా నీరు పెట్టేందుకు సమీపంలోని వాగు వద్దకు వెళ్లారు. మోటారును ఆన్ చేస్తుండగా ఒకరు కాలు జారి పడ్డారు. అతన్ని కాపాడే ప్రయత్నంలో మరొకరు నీటిలో పడిపోయారు. జీవాలను మేపుతున్న వారు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గన్‌పౌడర్ ఫ్యాక్టరీలో పేలుడు

- ఒకరు మృతి

రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లో శనివారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. బెమెతారా జిల్లా బెర్లా తాలుకా బోర్సి గ్రామంలో ఉన్న అతిపెద్ద గన్‌పౌడర్ తయారీ ఫ్యాక్టరీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో 17 మంది వరకు చనిపోయినట్లు వివిధ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. పోలీసులు, స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బోర్సి గ్రామంలో పేలుడు శబ్ధం భయంకరంగా వినిపించిందని.. ఆ ధాటికి భయంతో వణికిపోయామని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దట్టమైన పొగ అలుముకోవడంతో వెంటనే ఆ ఫ్యాక్టరీ వద్దకు పరుగులు తీశామన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కేరళ టీచర్లకు కృత్రిమ మేధపై శిక్షణ

తిరువనంతపురం : విద్యా, వైద్య రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా మెరుగైన స్థితిలో ఉన్న కేరళ మరింత అత్యాధునిక పద్ధతులను ఇమడ్చుకుంటూ ముందుకెళ్తోంది. ప్రస్తుతం వివిధ రంగాల్లో తీవ్ర ప్రభావం చూపుతున్న కృత్రిమ మేథస్సు (ఎఐ) ప్రయోజనాలను విద్యా రంగంలోనూ వినియోగించుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. ఎఐపై ఉపాధ్యాయులకు కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) శిక్షణ అందిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ తెలిపారు. శనివారం ఎడప్పల్లిలోని కైట్ ప్రాంతీయ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రం విజ్ఞాన కేంద్రంగా మారడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఈ శిక్షణ మరింత ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు.

దాదాపు 80 వేల మంది టీచర్లకు శిక్షణ ఇవ్వడం చాలా విశేషమని అన్నారు. జులైలో ఇక్కడ కృత్రిమ మేథస్సుపై ఒక సదస్సు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 ఏళ్ళలో కేరళ విజ్ఞానాధారిత పరిశ్రమల కేంద్రంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. సుశిక్షితులైన మానవ వనరులు రాష్ట్రానికి గల బలమన్నారు. కొత్తగా ఎదురయ్యే సవాళ్ళకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని రాజీవ్ తెలిపారు.

మోడీ బస చేశారు... బిల్లు కట్టండి

- ప్రభుత్వానికి మైసూర్ హోటల్ నోటీసు

మైసూర్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమ హోటల్‌లో బస చేసి.. 80 లక్షల రూపాయల బిల్లు చెల్లించనందుకుగాను చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు మైసూర్ రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ యాజమాన్యం హెచ్చరించింది. వివరాల్లోకి వెళితే.. ప్రధాని మోడీ గతేడాది ఏప్రిల్ నెలలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ), పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 50 సంవత్సరాల 'ప్రాజెక్టు టైగర్' ఈవెంట్ మైసూర్‌లో జరిగింది. ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 11 వరకు జరిగింది. ఈ ఈవెంట్‌ని ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోడీ మైసూర్‌కి వచ్చి అక్కడ ఉన్న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో బస చేశారు. దీనికిగానూ రూ. 80.6 లక్షల రూపాయల బిల్ అయింది. కాని, ఈ బిల్లుని హోటల్‌కి చెల్లించలేదు. ఈ బకాయిలను చెల్లించాలని కర్ణాటక ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్).. న్యూఢిల్లీ ఎన్‌టిసిఎ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కి లేఖ రాసింది. అయితే ఈ హోటల్ బకాయిలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని ఎన్‌టిసిఎ తిరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాసింది. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి మార్చి 22 2024వ తేదీన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ (పిసిసిఎఫ్) ప్రిన్సిపల్ సుభాష్ కె. మల్ఖేడే ఎన్‌టిసిఎకు లేఖ రాశారు. సుభాష్ రాసిన లేఖకు సంబంధించి ఎన్‌టిసిఎ సమాధానం ఇవ్వలేదు. ఆ తర్వాత 'ఏడాది గడిచినా హోటల్‌లో బస చేసినందుకు బిల్లు చెల్లించలేదు' అని మే 21న ఈ హోటల్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చీఫ్ బసవరాజుకు లేఖ రాశారు. బకాయిలు సరైన సమయంలో చెల్లించనందుగాను 12.09 లక్షలు, మొత్తం డబ్బు సంవత్సరానికి 18 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని బ్లూ ప్లాజా యాజమాన్యం లేఖలో పేర్కొంది. ఈ బకాయిల్ని ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోటల్ యాజమాన్యం హెచ్చరించింది. అయితే ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిందన్న కారణంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఈ హోటల్‌కి చెల్లించే బకాయిల్ని చెల్లించేందుకు తిరస్కరించిందని ఫారెస్ట్ చీఫ్ బసవరాజు అన్నారు.

ఐసిజె ఆదేశాలు బేఖాతరు

- కొనసాగుతున్న ఇజ్రాయిల్ దాడులు

రఫా: ఇజ్రాయిల్ వరుస దాడులతో గాజా, రఫా పరిసర ప్రాంతాల్లో మానవీయ సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. మంచినీరు, ఆహారం, మందులు అందక అక్కడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత 17 రోజులుగా ఆస్పత్రులకు ఇంధనం, నీటి సరఫరా బంద్ అయింది., వైద్య సరఫరాలు కూడా నిలిచిపోయాయి.. దాదాపు కుప్పకూలే పరిస్థితిలో వుంది. గాజాలో యుద్ధం మొదలైన తొలినాళ్ళలో వున్న పరిస్థితులే నేడు రఫాలో కనిపిస్తున్నాయి. ఉత్తర గాజాలోని ఒక స్కూలుపై జరిగిన దాడిలో పదిమంది పాలస్తీనియన్లు మరణించారు. 17 మంది గాయపడ్డారు. ఆ పొరుగు ప్రాంతాల నుండి పారిపోయి వచ్చి ఆ స్కూల్లో చాలామంది తలదాచుకున్నారు. జాబాలియా శరణార్థ శిబిరంపై కూడా భీకరంగా దాడి జరిగింది. అనేకమంది అక్కడ నుండి పారిపోయారు. వెస్ట్ బ్యాంక్‌లో జరుగుతున్న దాడుల్లో 15 మంది పాలీస్తీనియన్లను ఇజ్రాయిల్ సైన్యం అపహరించింది. ఇప్పటివరకు 8,855 మందిని ఇలా అదుపులోకి తీసుకున్నారని పాలస్తీనా ప్రిజనర్స్ సొసైటీ తెలిపింది. ఇప్పటివరకు గాజాలో 35,857 మంది మరణించగా, 80,293 మంది గాయపడ్డారు. గాజాలో జరుగుతున్న విషాదం మాటలకందనిదని ఐక్యరాజ్య సమితి అత్యవసర సహాయ కార్యకలాపాల చీఫ్ వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ దారుణాన్ని ఆపేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని అభిప్రాయపడ్డారు.

తక్షణ కాల్పుల విరమణ కోసం పెరుగుతున్న ఒత్తిడి

రఫాలోను, గాజాలోని ఇతర ప్రాంతాలపైన దాడులను ఇజ్రాయిల్ తక్షణమే నిలిపేయాలని ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె) ఆదేశించిన నేపథ్యంలో నెతన్యాహు ప్రభుత్వంపై ప్రపంచ దేశాల ఒత్తిడి మరింత పెరిగింది. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ మూడు యూరోపియన్ దేశాలు(స్పెయిన్, నార్వే, ఐర్లండ్) ఇటీవల ప్రకటించడంతో తీవ్ర ఇరకాటంలో పడ్డ నెతన్యాహుకు శుక్రవారం నాటి ఐసిజె ఆదేశం చెంపపెట్టు లాంటిది.

ఈ స్థితిలో తక్షణ కాల్పుల విరమణ ప్రకటించాలంటూ అమెరికా, బ్రిటన్, జర్మనీ మినహా చాలా వరకు ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాయి. జోర్డాన్ రాజుర అబ్దుల్లా-2, ఒమన్ సుల్తాన్ హితతమ్ బిన్ తారిఖ్, ఐరాసలో మొరాకో రాయబారి హిలాల్ ఇజ్రాయిల్ వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. ఐసిజె ఆదేశాలను, ప్రపంచ నేతల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ రఫాలో ఇజ్రాయిల్ ఊచకోత కొనసాగిస్తుంది.

తక్షణమే నిధులు విడుదలకు జి7 వినతి

పాలస్తీనా తక్షణ ఆర్థికావసరాలను దృష్టిలో వుంచుకుని విత్‌హెల్డ్‌లో పెట్టిన పాలస్తీనా అథారిటీ నిధులను తక్షణమే విడుదల చేయాలని జి-7 దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశారు. స్ట్రెరిసాలో సమావేశమైన వీరు గాజాలో పరిస్థితులపై చర్చించారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో కీలకమైన ఆర్థిక లావాదేవీలకు అంతరాయం కలిగించవద్దని వారు కోరారు. పాలస్తీనా బ్యాంకులతో లావాదేవీలను నిలిపివేయడానికి ఇజ్రాయిల్ యోచిస్తోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ వినతి వెలువడింది. ఇజ్రాయిల్, పాలస్తీనా బ్యాంకుల మధ్య కొనసాగుతున్న బ్యాంకింగ్ సేవలు యధావిధిగా సాగేలా చూడాలని కోరారు.



పాలస్తీనీయులకు సంఘీభావంగా యెమెన్‌లో భారీ ర్యాలీలు

సనా: గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ, మారణ హోమానికి వ్యతిరేకంగా యెమెన్ రాజధాని సనా, ఇతర రాష్ట్రాల్లో ను వారాంతపు నిరసన ర్యాలీలు శనివారం పెద్దయెత్తున జరిగాయి. అన్సార్ అలియా మూవ్‌మెంట్ నాయకుడు అబ్దుల్ అల్ హౌతి ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాపితంగా నిరసన ర్యాలీలు, మార్చ్‌లు నిర్వహించారు. గడచిన 24 గంటల్లో రఫా, ఉత్తర గాజాలోని ఇతర ప్రాంతాలపై ఇజ్రాయిల్ సాగించిన దాడుల్లో 57 మంది చనిపోయారు. మరో 93 మంది గాయపడ్డారు.మానవ హననంతోబాటు భవనాలు, పౌర మౌలిక సదుపాయాలు పెద్దయెత్తున ధ్వంసమయ్యాయని ఐరాస సహాయక పనుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) పేర్కొంది.

నేటి నుండి రెండు రోజులపాటు

సియోల్‌లో త్రైపాక్షిక శిఖరాగ్ర సదస్సు

- చైనా, ద.కొరియా, జపాన్ నేతల హాజరు

సియోల్: నాలుగేళ్ల విరామం తరువాత చైనా, జపాన్, ద. కొరియా దేశాలతో కూడిన తొమ్మిదో త్రైపాక్షిక శిఖరాగ్ర సదస్సు ఆది, సోమ వారాల్లో ఇక్కడ జరగనుంది. ఈ సదస్సుకు జపాన్ ప్రధాని కిషిదా, ద.కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్, చైనా ప్రధానికి లీ ఖియాంగ్ హాజరవుతున్నారు. ఆగ్నేయాసియా దేశాల సుస్థిరత ప్రోత్సహించడం, ఆర్థిక, వాణిజ్య, భద్రత , ఆరోగ్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి ఆరు రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఈ సదస్సు దృష్టి సారించనుంది. అలాగే వీటి మధ్య సాధారణ సంబంధాల పునరుద్ధరణపై ప్రత్యేకంగా కేంద్రీకరించనుంది. వీటితోబాటు అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితులపై మూడు దేశాల నేతలు చర్చించనున్నట్లు ద.కొరియా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎనిమిదో శిఖరాగ్ర సదస్సు 2019లో జరిగింది.

ఫ్రాన్స్‌లో స్తంభించిన విమాన సర్వీసులు

- పారిస్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల సమ్మె
- ఓర్లి విమానాశ్రయంలో 70 శాతం సర్వీసుల రద్దు

పారిస్ : ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు సమ్మెకు దిగడంతో శనివారం ఫ్రాన్స్‌లో విమానరాకపోకలు స్తంభించిపోయాయి.. పారిస్‌లోని ఓర్లీ విమానాశ్రయంలో 70 శాతానికి పైగా సర్వీసులను శని, ఆదివారాల్లో రద్దు చేస్తున్నట్లు ఫ్రెంచి పౌర విమానయాన శాఖ ప్రకటించింది. దీంతో శనివారం తెల్లవారు జామున 4 గంటల నుండి ఆదివారం రాత్రి పొద్దుపోయేవరకు అన్ని కమర్షియల్ విమానాలు రద్దయినట్లు డిజిఎసి అధికారులు తెలిపారు. వేతనాల, పని ఒత్తిడి వంటి సమస్యలపై యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు ఈ సమ్మె చేపట్టారు. జులై 26 నుండి పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ప్రపంచం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, అభిమానులు తరలిరానున్నారు. నెల రోజుల వ్యవధిలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు సమ్మె చేయడం ఇది రెండవసారి. ఫ్రాన్స్‌లో రెండో అతిపెద్ద లేబర్ గ్రూప్ యుఎన్‌ఎస్‌ఎ-ఐసిఎన్‌ఎ ఆధ్వర్యంలో ఈ సమ్మె జరుగుతోంది.

బస్తర్‌లో మరో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌ఘడ్‌లోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో మరోమారు ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. శనివారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. బీజాపూర్ జిల్లాలో ఇద్దరు మరణించగా, మరొకరు పొరుగున గల సుక్మా జిల్లాలో చనిపోయాడని తెలిపారు. బీజాపూర్‌లో జప్పెరమార్కా-కంకానర్ గ్రామాలకు సమీపంలో అటవీ ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా జిల్లా స్థాయి రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం అక్కడ మోహరించింది. కాల్పుల సమయంలో 15 మంది మావోయిస్టులు ఆ ప్రాంతంలో వున్నారని సమాచారం అందడంతో ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్ ముగిసిన తర్వాత ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను డిఆర్‌జి బృందం స్వాధీనం చేసుకుంది. వాటితో పాటూ ఆయుధాలు, వైర్‌లెస్ సెట్‌లు, బ్యాగ్‌లు, మావోయిస్టుల యూనిఫారం, మందులు, రోజువారీ వాడే సామాన్లను ఆ ప్రదేశం నుండి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుక్మా జిల్లాలోని బెల్‌పోచా గ్రామ సమీపంలో మరో ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మరణించాడని సుక్మా ఎస్‌పి కిరణ్ చవాన్ తెలిపారు. 26న ఆ సమీప గ్రామాల్లో మావోయిస్టులు బంద్‌కు పిలుపివ్వడంతో వారు అక్కడ వున్నారన్న సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు చెప్పారు. బూటకపు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూనే మావోయిస్టులు బంద్‌కు పిలుపిచ్చారు. దీంతో ఇప్పటివరకు ఈ ఏడాదిలో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 116 మంది మావోయిస్టులు మరణించారు.

త్వరలోనే జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు : సిఇసి



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూకాశ్మీర్‌లో నమోదైన ఓటరు టర్నవుట్‌తో ప్రోత్సాహం పొందిన ఎన్నికల కమిషన్ అతి త్వరలోనే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను చేపడుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం తెలిపారు. జమ్మూ కాశ్మీర్ ప్రజలు తమ ప్రభుత్వాన్ని కలిగి వుండేందుకు అర్హులని ఆయన పిటిఐతో వ్యాఖ్యానించారు. వివిధ నియోజకవర్గాల్లో టర్నవుట్‌లపై ప్రశ్నిస్తూ, అసెంబ్లీ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తారా అని పిటిఐ అడిగిన ప్రశ్నకు ఆయన పై రీతిలో సమాధానమిచ్చారు. పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రజల ప్రాతినిధ్యంపై ఇసి సంతృప్తిగా వుందన్నారు. పెద్ద సంఖ్యలో యువత, మహిళలు ఓటు వేయడానికి వస్తున్నారన్న సమాచారం తనకు చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రజలు పాల్గొంటున్నారు, దీంతో ప్రజాస్వామ్య మూలాలు మరింత బలోపేతమవుతున్నాయన్నారు. భద్రతా కారణాలు, ఇతర మౌలిక సదుపాయాల రీత్యా జమ్మూ కాశ్మీర్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించలేమని మార్చిలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తూ కుమార్ చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య 83 నుండి 90కి పెరిగింది.

జగన్ కనుసన్నల్లో ఐఎఎస్ పదవులు : దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హత ఉన్న అధికారులకు అన్యాయం చేసి అయిన వారికి ఐఎఎస్ పదవులను కట్టబెట్టేందుకు జగన్ కనుసన్నల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని టిడిపి నేత, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఐఎఎస్ నియామకాల నోటిఫికేషన్‌పై గోప్యత ఎందుకని? గడువు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. అధికార దాహంతో దాడులు దౌర్జన్యాలతో ఎన్నికల్లో గెలవాలని జగన్ కుట్ర చేస్తున్నారని టిడిపి నేతలు ఎన్‌బి సుధాకర్ రెడ్డి, సూరా సుధాకర్‌రెడ్డి మరో సమావేశంలో ఆరోపించారు. ఓటమి ఖాయమని భావించిన వైసిపి రౌడీ మూకలు చంద్రగిరి, పుంగనూరు, తాడిపత్రి నియోజకవర్గాల్లో తమ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడ్డారని చెప్పారు.

దళితుల భూములను కొట్టేసేందుకు జివో 569 : వర్ల రామయ్య

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవమర్ రెడ్డి పేదల భూములను తన కుమారుడికి అప్పగించేందుకు జివో 596ను విడుదల చేశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎస్ భూ వ్యవహారాలకు చెందిన ఫైల్స్ చూడకుండా ఎన్నికల కమిషన్ నియంత్రించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి సిబిఐ దర్యాప్తునకు ఆదేశించి పూర్తి నిజానిజాలు బయటకు తీయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు వెబ్‌కాస్టింగ్ బటన్ నొక్కుతున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని టిడిపి కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

అగ్నివీర్ పథకంపై ఆర్మీ సర్వే

- రాబోయే ప్రభుత్వానికి సిఫారసులు రూపొందించే అవకాశం


న్యూఢిల్లీ : ఆర్మీ అగ్నిపథ్ పథకంపై అంతర్గత సర్వేను నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు దాని రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై దాని ప్రభావాన్ని ఇది అంచనా వేస్తుంది. దీని ఆధారంగా స్కీమ్‌లో సాధ్యమయ్యే మార్పులపై రాబోయే ప్రభుత్వానికి సిఫారసులను రూపొందించే అవకాశం ఉన్నది. 2022 జూన్‌లో ప్రారంభించబడిన అగ్నిపథ్ పథకం అగ్నివీర్లను(సైనికులు, ఎయిర్‌మెన్, నావికులు) నాలుగు సంవత్సరాల పాటు సాయుధ దళాలలో నియమిస్తుంది. నాలుగు సంవత్సరాల పదవీకాలం ముగిసే సమయానికి, వారిలో 25 శాతం మంది మెరిట్, సంస్థాగత అవసరాలకు లోబడి రెగ్యులర్ ప్రాతిపదికన సేవల్లో చేరటానికి స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ వివాదాస్పద పథకంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రతిపక్షాలతో పాటు దేశ యువత ఈ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది.

ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ పథకానికి ముగింపు పలికి.. మునుపటి సైనిక నియామక ప్రక్రియకు తిరిగి తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేసింది. కొన్ని వారాల క్రితం.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ అవసరమైతే అగ్నిపథ్ పథకాన్ని మార్చటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదనీ, అగ్నివీరులుగా చేరిన యువకుల భవిష్యత్తుపై ప్రభావం ఉండదని అన్నారు.కాగా, ఆర్మీలో 40,000 మంది అగ్నివీరులతో కూడిన రెండు బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని పోస్టింగ్‌లో ఉన్నారు. 20,000 మందితో కూడిన మూడో బ్యాచ్ గతేడాది నవంబర్‌లో శిక్షణను ప్రారంభించింది. నేవీలో మూడు బ్యాచ్‌ల 7,385 అగ్నివీర్‌లు శిక్షణను పూర్తి చేశారు. ఐఎఎఫ్‌లో 4,955 మంది అగ్నివీర్ వాయు ట్రైనీలు శిక్షణను పూర్తి చేసుకున్నారు.

వేసవి విడిది

జీవన the family







ఎల్. శ్రుతి హాసిని,
8వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
గుణదల,
విజయవాడ.





పి.ఎలిజబెత్ రాణి,
6వ తరగతి, జెడ్‌పి
హైస్కూల్, సి బెల్గాల్
మండలం,
కోడమూరు తాలుకా,
కర్నూలు జిల్లా.





ఎ.చేతన్ ఆనంద్
6వ తరగతి
పల్లవి మాడల్ స్కూల్
బోడుప్పల్.
హైదరాబాద్

తాటి ముంజలు




తాటి ముంజలు... తాటి ముంజలు
వేసవిలో చలువనిచ్చే ఐస్ యాపిళ్లు
చూడగానే సిజేరియన్ బేబీల్లా ముద్దొచ్చి
పట్టుకుంటే జారిపోయే తాటిముంజలు
నోట్లో చల్లగా కరిగిపోయే తాటిముంజలు
ముఖం మీది మొటిమలకు లేపనం
చెమటకాయలకు చక్కటి ఉపశమనం
విటమిన్లు మెండు మలబద్ధకానికి మందు
రూపులో లిచి పండును పోలివుండు
రుచియోమో లేత కొబ్బరిలా వుండు
తాటికాయల జోడెడ్ల బండి ఆట
వేసవిలో మదికి పన్నీటి జల్లుల పాట
పిల్లలు పెద్దలు ప్రియమార పలికే మాట
తాటి ముంజలు.. తాటి ముంజలు!

- సురేంద్ర రొడ్డ,
94915 23570.

అమ్మమ్మ గారి ఊళ్లో భలే సరదాగా ...



డిజి పేటలోని అమ్మమ్మ గారి ఇంటిలో గడిపిన ఈ వేసవి సెలవులు నాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆ ఊరి చుట్టూ కొండలు, అడవులు, తోటలు నాకు భలే బాగా నచ్చాయి. రాత్రివేళ వెన్నెల వెలుగులో, చల్లని వాతావరణంలో కుటుంబ సభ్యులందరం మిద్దెపై కూర్చుని కబుర్లు చెప్పుకోవడం భలే బాగుంది. ఇక్కడ పిల్లలు ఆడే ఆటలన్నీ నాకు కొత్త కొత్తగా అనిపించాయి. అమ్మమ్మ గారి మామిడి తోట ఎంతో బాగుంది. బెంగళూరులో స్కూలు, ఇల్లు, చదువు, ఫోన్, టీవీ ఇదే లోకంగా ఉండేది. వేసవి సెలవులలో అమ్మమ్మ గారి ఇంటి దగ్గర పిల్లలతో కలిసి ఆడుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది. భైరవకోనలో జలపాతం భలే బాగా నచ్చింది. అక్కడ కొలనులో ఈత కొట్టడం సరదాగా ఉంది. ముఖ్యంగా డిజి పేటలో రామాలయం వద్ద ఆడవాళ్లు చేస్తున్న భజన భలే వెరైటీగా ఉంది. తాతయ్యతో కలిసి ఊరిలో స్కూటర్‌పై తిరుగుతుంటే చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఇక్కడి నుంచి బెంగుళూరు వెళ్లాలంటే ఏదోలా వుంది. ఇంత ఆనందమైన రోజులను ఎప్పటికీ మరచిపోలేను.





- నైనిక రెడ్డి,
8వ తరగతి, బెంగళూరు.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
– ఎడిటర్

విజ్ఞాన, వినోదాల వేసవి శిబిరం

వేసవి సెలవులంటే పిల్లలకు సరదా. ఆ సెలవుల కోసం పిల్లలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తారు. వేసవి సెలవులకు నువ్వెక్కడికి వెళ్తావంటే, నువ్వెక్కడికి వెళ్తావు? అంటూ చిన్నారుల మధ్య సంభాషణలు ఎంతో ఆసక్తికరంగా జరుగుతాయి. ఒకప్పుడు వేసవి సెలవులన్నీ అమ్మమ్మ, నాన్నమ్మల ఒడిలో గడిపే బాల్యం నేడు అర చేతులో ఇమిడే సెల్ ఫోన్‌కు బందీ అయింది. దీంతో ఆప్యాయత, అనురాగం, ప్రేమ, లాలిత్యం బాల్యానికి దూరమయ్యాయి.

దీన్ని దష్టిలో పెట్టుకొని బాలలు కోల్పోతున్న నిజమైన బాల్యం... తల్లిదండ్రులు విస్మరించిన కుటుంబ సంబంధాలు... పాఠశాలలు వదిలేసిన మానవ సంబంధాలు... ఆధునిక శాస్త్ర, సాంకేతికత విజ్ఞానాల పరిచయం... వినోదాన్ని జోడించి, బాలలను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో మూడేళ్ల నుంచి సమ్మర్ క్యాంప్ (వేసవి శిబిరం) నిర్వహిస్తున్నారు.

ఈ వేసవి శిబిరానికి బాలల నుంచి, వారి తల్లితండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. స్కూలికి వెళ్లడానికి అప్పుడప్పుడు మారాం చేసే బాలలు కూడా ఈ శిబిరానికి ఉత్సాహంగా క్రమం తప్పకుండా హాజరు కావడం విశేష స్పందనకు ఉదాహరణ. పిసిసి నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్, ఎన్నో ప్రాంతాల్లో నిర్వహణకు స్ఫూర్తిదాయకమైంది. ఈ సమ్మర్ క్యాంపును తిలకించేందుకు వచ్చిన ఇతర ప్రాంతాలకు చెందిన ఎందరికో తమ తమ ప్రాంతాల్లో ఇటువంటి క్యాంపులు నిర్వహించాలని ఆసక్తి కనబరుస్తున్నారు.

ఈ ఏడాది మే 7న అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ప్రారంభమైన సమ్మర్ క్యాంప్, జూన్ 9 వరకూ నడుస్తుంది. ప్రతి రోజూ 200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. రోజూ ఉదయం గంటన్నర పాటు సెల్ఫ్ డిఫెన్స్, కరాటే నిర్వహిస్తున్నారు. అనంతరం గంట పాటు చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్‌లతో పాటు క్రీడలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మూడు గంటల పాటు క్యాంప్ జరుగుతుంది. మొదటి రెండు గంటలూ మాథమేటిక్స్, సైన్స్ ప్రయోగాలు, సైన్స్ మ్యాజిక్, మట్టితో బొమ్మల తయారీ, సోషల్, కథారచన, పద్య పఠనం, డ్రాయింగ్, క్రాఫ్ట్, మెమెరీ గేమ్స్, కార్టూన్ గీయడం, పప్పెట్రీ షో, కోలాటం, నాటికలు, మైమ్, డాన్స్, క్విజ్, ఆట, పాట, ఇసుకతో ఒంటె తయారీ, బియ్యానికి రంగులేసి సీతాకోకచిలుక తయారీ, లైవ్ జంతువుల గురించి వివరించడం... ఇలా రకరకాల ఆసక్తికరమైన అంశాలతో సాగుతోంది. రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య కర్రసాము శిక్షణ ఇస్తున్నారు. ఇవికాక వారంలో ఒకరోజు ఒక డాక్టర్‌తో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నారు. ప్రత్యామ్నాయ విద్యా విధానానికి బాటలు వేస్తున్నారు. ఈ వేసవి శిబిరంలో పాల్గొంటున్న పిల్లలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు పాఠశాలల్లో నేర్పని అనేక విజ్ఞానపు విషయాలు నేర్పుతున్నారని తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకుని, పాఠశాలలకు వెళ్లిన తరువాత అక్కడ వీటిని తోటి విద్యార్థులకు నేర్పుతున్నారు. దీంతో విద్యా అభిమానులు, విద్యావేత్తల నుంచి ఈ శిబిరాలనికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సమ్మర్ క్యాంప్ జరుగుతున్న విధానాన్ని సోషల్ మీడియాలో తెలుసుకుని, సమ్మర్ క్యాంప్ నిర్వహణకు, విద్యార్థులకు ఇచ్చే స్నాక్స్‌కు అనేకమంది సహాయ సహకారాలు అందిస్తున్నారు.

వివిధ కార్యక్రమాల్లో ...

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) 20 మంది యువతీ యువకులతో పని చేస్తుంది. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బుద్దా శ్రీనివాస్ గౌరవ అధ్యక్షులుగా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పిసిసి ఒక్క సమ్మర్ క్యాంప్‌కే పరిమితం కాలేదు. అల్లూరి సీతారామరాజు 93వ జయంతి సందర్భంగా 93 మంది చిన్నారులకు అల్లూరి వేషధారణ వేసి, ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా చిన్నారులతో భారీ కాగడాల ప్రదర్శన నిర్వహించారు.

మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు కవుల వేషధారణ, పద్యాలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పెద్దాపురం మండలంలో పదో తరగతి పరీక్షల్లో మొదటి, రెండో స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అత్యాచార దాడులకు వ్యతిరేకంగా రెజ్లర్లు ఆందోళన జరిపినపుడు వారికి మద్దతుగా ప్రదర్శన జరిపారు. ఇస్రో శాటిలైట్ ప్రయోగాన్ని ప్రొజెక్టర్‌పై ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనేక సందర్భాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో జరిగిన జాతీయ సౌత్ జోన్ కరాటే పోటీలకు ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులను తీసుకెళ్లారు. ఈ పోటీల్లో 15 మందికి బంగారు, వెండి, కాంస్య పతకాలు వచ్చాయి. పిసిసిలో వందలాది మంది చిన్నారులు భాగస్వామ్యం అయ్యారు. ఇలా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం, వికాసం అందిస్తుంది.


- జె.జగదీష్, చల్లా విశ్వనాథం





పిసిసి నిర్వహిస్తున్న బాలల వేసవి శిబిరం ప్రజాదరణ పొందుతోంది. విద్యార్థులను తరగతులుగా విభజించి, శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రకాల విజ్ఞానపు అంశాల్లో నిష్ణాతులైన ప్రముఖులతో శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులకు విద్యతో పాటు వినోదం, వికాసం కావాలనేది పిసిసి లక్ష్యం.

- కూనిరెడ్డి అరుణ,
రొంగల అరుణ్ కుమార్,
పిసిసి అధ్యక్ష, కార్యదర్శులు.



స్కూల్లో కంటే ఇక్కడే బాగుంది. ఇక్కడలానే స్కూల్ కూడా విద్యా విధానం ఉంటే బాగుంటుంది. చదువుతో పాటు క్రీడలు, మేజిక్ వంటి ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నారు. నేను గత రెండేళ్లుగా విశాఖపట్నం నుంచి వచ్చి ఈ సమ్మర్ క్యాంప్‌కు హాజరవుతున్నా.

- ఓ.లిఖిత్ చంద్ర, 9వ తరగతి,
విశాఖపట్నం



పిసిసి సమ్మర్ క్యాంప్‌కు గత మూడేళ్లుగా హాజరవుతున్నా. ఈ సమ్మర్ క్యాంప్ కొత్త స్నేహితులను ఇస్తుంది. పెద్దాపురానికి బంధువుల ఇంటికి వచ్చిన అనేక మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌కు వస్తున్నారు. విద్యతో పాటు వినోదం, వికాసం వస్తుంది.

- యాసలపు లీలా, పదో తరగతి,
పెద్దాపురం.



కేన్స్‌లో ఉత్తమ నటిగా అనసూయ గుప్తా

భారతీయ నటులకు ఇదే తొలిసారి

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ నటి అనసూయ సేన్‌గుప్తా చరిత్ర సృష్టించింది. ఉత్తమ నటిగా అవార్డు పొందింది. అంతర్జాతీయంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ అవార్డును అందుకునున్న తొలి భారతీయ నటిగా ఆమె చరిత్రకెక్కారు. 'అన్ సర్టెయిన్ రిగార్డ్' విభాగంలో ఉత్తమ నటి అవార్డును ఆమె సొంతం చేసుకుంది. బల్గేరియన్ చిత్ర నిర్మాత కాన్‌స్టాంటిన్ బోజనోవ్ దర్శకత్వం వహించిన 'షేమ్‌లెస్' చిత్రంలో ఆమె పాత్రకు గాను ఈ అవార్డు లభించింది. ఢిల్లీలోని ఓ వేశ్యాగృహం నుంచి పోలీసులను కత్తితో పొడిచి పారిపోయిన 'రేణుక' అనే ఒక వేశ్య జీవిత ప్రయాణాన్ని ఇందులో చిత్రీకరించారు. కోల్‌కతాకు చెందిన అనసూయ సేన్‌గుప్తా వేశ్య పాత్రలో తన నటనతో మెప్పించారు. కేన్స్ వేడుకల్లో 'షేమ్‌లెస్' చిత్రాన్ని ప్రదర్శించగా ఉత్తమ నటిగా ఆమె అవార్డు దక్కింది. అనసూయ సినిమా రంగంలో ఉన్నప్పటికీ వెండితెరపై కనిపించలేదు. ముంబైలో ప్రొడక్షన్ డిజైనర్‌గా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం గోవాలో అనసూయ సేన్‌గుప్తా నివసిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ షో 'మసబా మసబా' చిత్రాన్ని నిర్మించడంలో ఆమె కీలకపాత్ర పోషించింది. బెంగాలీ దర్శకుడు అంజన్ దత్ నిర్మించిన రాక్ మ్యూజికల్ మ్యాడ్లీ బెంగాలీ (2009)లో ఆమె తొలిసారిగా నటించింది. ఆ తర్వాత ఆమె నటనకు దూరమైంది. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ అంజన్ దత్ సాయంతోనే షేమ్‌లెస్ చిత్రంలో కనిపించి ఉత్తమ నటిగా అవార్డ్‌ను సొంతం చేసుకోవడం విశేషం. ఈ సినిమాలో వేశ్యగా 'రేణుక' పాత్రలో అనసూయ సేన్‌గుప్తా మెప్పించింది. వేశ్యగా జీవిస్తున్న ఆమెకు సమాజంలో ఎదురైన సవాళ్లను ఎలా ఎదుర్కొందో ఈ చిత్రం చూపుతుంది.

దూకే సాలీడు



బెంగళూరు : సాధారణంగా సాలీడు పాకుతుంది. అయితే ఓ కొత్తజాతి సాలీడు మాత్రం దూకుతుంది. ఆశ్చర్యం కలిగించే ఈ సాలీడు ఎన్నో ఏళ్ల క్రితంకి చెందింది. తాజాగా ఇటువంటి జాతి సాలీడుని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రకృతి శాస్త్రవేత్తల బృందం కర్ణాటకలోని కొడగు జిల్లాలో సోమవారపేట తాలుకాలోని గర్వాలే అనే గ్రామంలో కనుగొన్నది. ఈ గ్రామంలో కనుగొన్నందున ప్రత్యేకించి ఈ సాలీడుకి లిగ్డస్ గర్వాలే అని శాస్త్రవేత్తలు పేరుపెట్టారు. ఇక ఈ సాలీడు గురించి ఈ బృందంలోని దివ్యశ్రీ మాట్లాడుతూ.. 'ఆగ్రో ఫారెస్ట్రీ చుట్టూ ఉన్న గర్వాలే గ్రామంలో లిగ్డస్ గర్వాలే కనిపించింది. ఈ ప్రాంతంలో కాఫీ తోటలు, మిరియాల తోటలు, వరి పొలాలలు ఉన్నాయి.' అని ఆమె అన్నారు. కాగా, 'ఈ సాలీడుని కనుగొన్న తర్వాత.. దాని శరీర నిర్మాణ పరీక్ష కోసం పరిశోధకుడు కాలేబ్‌కు నమూనాను పంపాము. ఈ జాతి సాలీడు 129 సంవత్సరాలలో గుర్తించడం రెండోసారి. ఈ జాతికి చెందిన లిగ్డస్ చెలిఫర్‌ని మొదటిసారి 1895లో మయన్మార్‌లో కనుగొన్నారు. ఇప్పుడు కనుగొన్న గర్వెల్ గ్రామంలో అల్లం ఆకు అడుగు భాగంలో గుర్తిం చాము. ఈ సాలీడు 0.2 అంగుళాలు. దీనికి ఎనిమిది కాళ్లు, ఎని మిది కళ్లు, సన్నని వెంట్రుకలు కప్పబడిన శరీరం కలిగి ఉంది. సాధారణంగా సాలీడు పాకుతుంది. కానీ ఇది మగ సాలీడు కావడంతో దూకుతుంది' అని ఈ బృందంలోని అభిజిత్ అన్నారు.



'భజే వాయు వేగం' ట్రైలర్ విడుదల

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'భజే వాయు వేగం'. ఈ చిత్రానికి ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. ఐశ్వర్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో 'హ్యాపీ డేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో యువీ కాన్సెప్ట్ బ్యానర్‌పై 'భజే వాయువేగం' రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'బెదురులంక 2012' చిత్రం విజయం తర్వాత మరో విభిన్నమైన కథతో ఆయన ప్రేక్షకుల ముందుకు కార్తికేయ వస్తున్నాడు. 'భావోద్వేగాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ ఇది. తండ్రీ తనయుల బంధం చుట్టూ మలిచిన సన్నివేశాలు చిత్రానికి ప్రధానబలంగా ఉండనున్నాయి. ట్రైలర్‌లో కూడా ఆ ఎమోషన్స్ ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఈ సినిమా మే 31న విడుదల కానుంది' అని వివరించారు.

నెట్‌ఫ్లిక్స్‌లో ఇండియన్ సినిమాల హవా



ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో ఇండియన్ సినిమాలు, వెబ్ సిరీస్‌ల హవా కొనసాగుతోంది. గతేడాది నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన భారతీయ సినిమాలు కోట్ల వ్యూస్‌తో టాప్‌లో ఉన్నాయి. తాజాగా ఈ సంస్థ 2023లో అత్యధిక వ్యూస్ సాధించిన వాటి వివరాలను ప్రకటించింది. ఇందులో ఇండియన్ మూవీస్, సిరీస్, షోలు అన్నీ కలిపి వన్ బిలియన్ వ్యూస్ సాధించాయి. కరీనా కపూర్ ప్రధానపాత్రలో తెరకెక్కిన మిస్టరీ థ్రిల్లర్ 'జానేజాన్' 20.2 మిలియన్ల వ్యూస్‌తో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాత స్థానంలో 16.2 మిలియన్ల వ్యూస్‌తో షారుక్ నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'జవాన్', మూడులో విశాల్ భరద్వాజ్ నటించిన 'ఖుషియా' (12.1 మిలియన్లు) నిలిచాయి. వీటితో పాటు 'ఓఎంజీ2', 'లస్ట్ స్టోరీస్2', 'డ్రీమ్ గర్ల్2' కూడా మంచి వ్యూస్‌ను దక్కించుకున్నాయి. 1984లో జరిగిన భోపాల్ దుర్ఘటన ఆధారంగా తెరకెక్కించిన 'ది రైల్వే మెన్' వెబ్ సిరీస్ 10.6 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 2023 మొత్తంలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది చూసిన సినిమాగా 'లీవ్ ద వరల్డ్ బిహైండ్' 121 మిలియన్ల వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉంది. వెబ్ సిరీస్‌లో 72 మిలియన్లతో 'వన్ పీస్' టాప్‌లో నిలిచింది.

టైటిల్ కొట్టేదెవరో..?

- ఐపిఎల్ తుది పోరు నేడే
- రెండో టైటిల్‌పై సన్‌రైజర్స్
- మూడో టైటిల్‌పై కోల్‌కతా గురి



రాత్రి 7.30 గం॥లకు

చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17 చివరి దశకు చేరింది. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య ఆదివారం టైటిల్‌పోరు జరగనుంది. శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ సారథి శ్రేయస్ అయ్యర్ చెన్నై బీచ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఐపిఎల్ ట్రోఫీతో సందడి చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఐపిఎల్ నిర్వాహకులు శనివారం ఐపిల్ ట్విటర్(ఎక్స్)లో పోస్ట్ చేశారు. ఐపిఎల్ చరిత్రలో అత్యధిక సార్లు ఫైనల్ ఆడిన ఆల్‌టైమ్ రికార్డు మాత్రం చెన్నైదే. ఆ జట్టు ఏకంగా పది పర్యాయాలు టైటిల్ వేటలో నిలవడమే కాకుండా ఐదు ట్రోఫీలను చేజిక్కించు కుంది. ఇక ముంబయి ఇండియన్స్ ఆరుసార్లు ఫైనల్‌కు చేరి ఐదుసార్లు టైటిల్‌ను సాధించింది. గౌతం గంభీర్ సారథ్యంలో కోల్‌కతా రెండుసార్లు (2012, 2014) చాంపియన్‌గా నిలిచింది. 2021లో కేకేఆర్ పోరాడినా చివరకు చెన్నై గెలుపొందడంతో ట్రోఫీ చేజార్చుకుంది. ఈసారి ఐపిఎల్‌లో పలు రికార్డులు నమోదయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండు సార్లు రికార్డు స్కోర్లను నమోదు చేసి ఐపిఎల్ చరిత్రలో పలు సంచలనాలకు తెరలేపింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్–2లో సన్‌రైజర్స్ జట్టు రాజస్థాన్ రాయల్స్‌పై సంచలన విజయంతో మూడోసారి ఫైనల్లోకి అడుగుపెట్టింది. 2016లో తొలిసారి టైటిల్‌ను నెగ్గిన సన్‌రైజర్స్.. 2018లో ఫైనల్ చేరినా.. చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఓడి రన్నరప్‌తో సంతృప్తిపడాల్సి వచ్చింది.

ఇక కోల్‌కతా నైట్‌రైడర్స్ 2012, 2014లో టైటిళ్లను నెగ్గి 2021 రన్నరప్‌గా నిలిచింది. ఈసారి లీగ్‌లో కోల్‌కతా 14మ్యాచుల్లో 9మ్యాచుల్లో గెలిచింది. మరో 2మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దు కాగా.. కేవలం 3మ్యాచుల్లో మాత్రమే పరాజయాన్ని చవిచూసింది. ఈ క్రమంలో 20పాయింట్లతో మిగతా జట్లకు అందనంత ఎత్తులో నిలిచి అగ్రస్థానంతో క్వాలిఫయర్–1కు చేరింది. అదే ప్రదర్శనను క్వాలిఫయర్–1లో సన్‌రైజర్స్‌పై చూపింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 160పరుగుల లక్ష్యాన్ని కేవలం 13.4ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జట్టు ఏదైనా ఉందంటే అది కోల్‌కతా మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌తో ఆడి రెండు మ్యాచుల్లోనూ కోల్‌కతా జట్టు ఘన విజయం సాధించింది.

జట్లు...

సన్‌రైజర్స్: కమిన్స్(కెప్టెన్), హెడ్, అభిషేక్ శర్మ, త్రిపాఠి, మార్‌క్రమ్, క్లాసెన్(వికెట్ కీపర్), నితీశ్ రెడ్డి, సమద్, షాబాజ్ అహ్మద్/ఫిలిప్స్, ఉనాద్కట్, భువనేశ్వర్, నటరాజన్.

కోల్‌కతా: శ్రేయస్(కెప్టెన్), గుర్బాజ్, నరైన్, వెంకటేశ్ అయ్యర్, రింకు సింగ్, రస్సెల్, రమన్‌దీప్, స్టార్క్, వైభవ్, హర్షిత్, వరణ్ చక్రవర్తి.

జ్యోతి సురేఖ బృందానికి స్వర్ణం



సియోల్(కొరియా): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–2లో భారత ఆర్చర్లు సత్తా చాటుతున్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ బృందం స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన మహిళల జట్టు 236–226పాయింట్ల తేడాతో టర్కీపై ఘన విజయం సాధించింది. కాంపౌండ్ విభాగంలో భారత ఆర్చరీ బృందం టాప్ ర్యాంక్‌లో ఉంది. ఇక మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ–ప్రియాంశ్ బృందం ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత జంట 153–155పాయింట్ల తేడాతో అమెరికాకు చెందిన ఒలీవియా డీన్–సాయెర్ చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

ఫైనల్‌కు సింధు

మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సింధు 13–21, 21–16, 21–12 పాయింట్ల తేడాతో థాయ్‌లాండ్ ప్లేయర్ బుసానన్‌పై ఘన విజయం సాధించింది. తొలి గేమ్ నుంచే సింధూ.. బుసానన్‌పై ఆధిపత్యం చెలాయించింది. ఈ ఏడాది మాస్టర్స్ టోర్నీలో సింధూ ఫైనల్ అర్హత సాధించడం ఇదే తొలిసారి. సింధూ గత ఏడాది మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ ఫైనల్‌కు చేరింది. కాగా 2019లో హాంకాంగ్ ఓపెన్‌లో సింధును బుసానన్ ఓడించి టైటిల్ సాధించింది. ఈ మ్యాచ్ దాదాపు 88 నిమిషాల పాటు సాగింది. తాజా విజయంతో సింధూ తన ఓటమికి బదులు తీర్చుకుంది. ఇక ఆదివారం జరగనున్న ఫైనల్‌లో చైనా ప్లేయర్ వాంగ్ ఝియితోస సింధు తలపడనుంది. మరో సెమీస్‌లో వాంగ్ 21–9, 21–11తో సహచర షట్లర్ జంగ్‌పై వరుససెట్లలో గెలిచింది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి విక్టర్ అక్సెల్సన్(డెన్మార్క్)–జంగ్(మలేషియా) ప్రవేశించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68